సమన్వయకర్తలే వైసీపీ అభ్యర్థులు!

ముగ్గురు వారసులు... నలుగురికి మళ్ళీ ఛాన్సు

తిరుపతి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధిష్ఠానం అభ్యర్థులను శనివారం ప్రకటించింది.ఇదివరకే ప్రకటించిన నియోజకవర్గాల సమన్వయకర్తలే రానున్న ఎన్నికల బరిలో అభ్యర్థులుగా పోటీ చేయనున్నారు.వీరిలో ముగ్గురు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు, ఒక సిట్టింగ్ ఎంపీకి మళ్ళీ పోటీ చేసే ఛాన్సు లభించింది. మంత్రి రోజా వైసీపీ తరపున నగరి నుంచీ వరుసగా మూడోసారి, మొత్తంగా అయితే ఐదవసారి పోటీ చేయనున్నారు.కిలివేటి సంజీవయ్య సూళ్ళూరుపేట నుంచీ మూడవసారి పోటీ చేస్తున్నారు.బియ్యపు మధుసూదన రెడ్డి శ్రీకాళహస్తి నుంచీ వరుసగా మూడవసారి వైసీపీ తరపున పోటీ చేస్తున్నారు.తిరుపతి లోక్‌సభకు 2021లో జరిగిన ఉప ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీచేసి గెలిచిన సిట్టింగ్ ఎంపీ గురుమూర్తికి ప్రస్తుత ఎన్నికల్లో పార్టీ మళ్ళీ అవకాశం కల్పించింది.

వెంకటగిరి



పేరు: నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి
పుట్టిన తేదీ: 8.1.1965
విద్యార్హత: బీటెక్
తల్లిదండ్రులు: నేదురుమల్లి జనార్ధనరెడ్డి , రాజ్యలక్ష్మి
భార్య: స్వప్న, పిల్లలు: అలేఖ్య రెడ్డి, విక్రమ్ రెడ్డి
స్వగ్రామం: విద్యానగర్,వాకాడు మండలం
గతంలో పదవులు: కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు చైర్మన్(ఎడ్యుకేషనల్), తిరుపతి జిల్లా వైసీపీ అధ్యక్షుడు.

నగరి



పూర్తి పేరు: ఆర్కే రోజా
పుట్టిన తేదీ: 11.07.1972
భర్త: సెల్వమణి
కుమారుడు: కృష్ణ కౌశిక్,
కుమార్తె: హన్షుమాలిక
విద్యార్హత: బీఎస్సీ
సొంతూరు: మూగలమర్రి, వాల్మీకిపురం మండలం
రాజకీయ నేపథ్యం: 1999లో టీడీపీ తరపున ప్రచారం చేశారు. 2004 ఎన్నికల్లో నగరి టీడీపీ నుంచి ఓటమి. 2009 ఎన్నికల్లో చంద్రగిరి టీడీపీ నుంచి ఓటమి. 2014, 2019 ఎన్నికల్లో నగరిలో వైసీపీ నుంచి గెలుపు. పర్యాటకశాఖ మంత్రిగా పనిచేశారు.

గూడూరు



పేరు: మేరిగ మురళీధర్
పుట్టిన తేది : 5-1-1969
విద్యార్హత: ఎంఏ
తల్లిదండ్రులు: మేరిగ ఆనందరావు, సుందరమ్మ
భార్య: జ్యోతి
పిల్లలు: రేవంత్ చక్రవర్తి, హేమంత్ కల్యాణ్
స్వగ్రామం: రాపూరు
గతంలో పదవులు: జడ్పీటీసీ సభ్యుడిగా, నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా, వైసీపీ రాష్ట్ర కార్యదర్శిగా, ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఎమ్మెల్సీగా, శాసనమండలి విప్‌గా వ్యవహరిస్తున్నారు.

సూళ్లూరు పేట



పేరు: కిలివేటి సంజీవయ్య
పుట్టిన తేది: 2 ఆగస్టు 1965
విద్యార్హత: బీటెక్
తల్లిదండ్రులు: కిలివేటి రాజయ్య, మస్తానమ్మ
భార్య: పసల సుభాషిణి
పిల్లలు: ఇద్దరు ఆడపిల్లలు
స్వగ్రామం: కాదలూరు, తడ మండలం
గతంలో పదవులు: 2014, 2019లో సూళ్లూరుపేట నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

చంద్రగిరి



పేరు: చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి
పుట్టిన తేది: 29-6-1998
విద్యార్హత: ఎంఎస్
స్వస్థలం: తుమ్మలగుంట, తిరుపతి రూరల్ మండలం
తల్లిదండ్రులు: చెవిరెడ్డి భాస్కరరెడ్డి,లక్ష్మి - గతంలో పదవులు : తిరుపతి రూరల్ ఎంపీపీ, తుడా చైర్మన్

ఐదుగురికి తొలి అవకాశం

వెంకటగిరి నుంచీ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి 2014లో కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. అయితే ఉపసంహరణ గడువు ముగిశాక పోటీ నుంచీ తప్పుకుంటున్నట్టు ప్రకటించారు. ఆయన బరి నుంచీ తప్పుకున్నా సాంకేతికంగా మాత్రం ఆ ఎన్నికల్లో అభ్యర్థిగానే వున్నారు. ప్రస్తుత ఎన్నికల్లో వైసీపీ తరపున వెంకటగిరి నుంచీ పోటీ చేస్తున్నారు. గూడూరు అభ్యర్థి మేరిగ మురళీధర్ గతేడాదిలో స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అంతకు మునుపు రాపూరు జడ్పీటీసీగా గెలిచారు. అసెంబ్లీ బరిలో తొలిసారిగా ఇపుడు పోటీ చేస్తున్నారు. తిరుపతి నుంచి భూమన అభినయరెడ్డి ,చంద్రగిరి నుంచి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, సత్యవేడు నుంచీ నూకతోటి రాజేష్ అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారి పోటీ పడుతున్నారు.

తిరుపతి



పేరు : భూమన అభినయరెడ్డి
పుట్టిన తేది : 30-7-1987
విద్యార్హత : ఎంఎస్
తల్లిదండ్రులు: భూమన కరుణాకర రెడ్డి, రేవతి
భార్య : మోనీషారెడ్డి
పిల్లలు: కుమారుడు వీర్ అద్యాంత్, కుమార్తె అర్యాహి
స్వస్థలం : తిరుపతి గతంలో పదవులు : తిరుపతి డిప్యూటీ మేయర్

శ్రీకాళహస్తి



పేరు: బియ్యపు మధుసూదన రెడ్డి
పుట్టిన తేది: 15-5-1971
విద్యార్హత: బీఏ
తల్లిదండ్రులు: సుశీలమ్మ, గోవిందరెడ్డి
భార్య: శ్రీవాణి రెడ్డి
పిల్లలు: కుమార్తె పవిత్రా రెడ్డి, కుమారుడు ఆకర్ష్ రెడ్డి
స్వస్థలం: ఏఎం పుత్తూరు, శ్రీకాళహస్తి, గతంలో పదవులు: సిట్టింగ్ ఎమ్మెల్యే

సత్యవేడు



పేరు: రాజేష్ నూకతోటి
పుట్టిన తేది: 25-8-1970
విద్యార్హత: ఎంఏ
తల్లిదండ్రులు: హేమలత, గంగాధరం
భార్య: చైతన్య భాను
పిల్లలు: కుమారుడు వెంకట చరిత్ శ్రేయాన్
స్వస్థలం: వైకుంఠపురం,తిరుపతి
గతంలో పదవులు: కాంగ్రెస్ సేవాదళ్ కార్యదర్శి .

ప్రభావం చూపని అసమ్మతి

జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపికపై అసమ్మతి నేతలు ఎలాంటి ప్రభావాన్నీ చూపించలేకపోయారు. నగరి, వెంకటగిరి, సూళ్ళూరుపేట నియోజకవర్గాల్లో బలమైన నేతలు వ్యతిరేకించినా రోజా, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్యలకు అభ్యర్థులుగా అవకాశం లభించింది. దీంతో అసమ్మతి నేతలు అవమానకర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. నగరిలో మంత్రి రోజాను నాలుగేళ్ళుగా బలమైన వర్గం వ్యతిరేకిస్తోంది. ఆమెకు టికెట్ ఇవ్వకూడదని తరచూ అధిష్ఠానాన్ని కోరుతూ వచ్చింది.టికెట్ ఇస్తే ఓడిస్తామని కూడా ఆల్టిమేటమ్ జారీ చేసింది. అయితే ఆమెను కాదని రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవులు కూడా తెచ్చుకోగలిగిన అసమ్మతి నేతలు రోజాకు టికెట్ రాకుండా మాత్రం అడ్డుకోలేకపోయారు.వెంకటగిరిలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని అన్ని మండలాల్లోనూ ప్రజాబలమున్న నాయకులు వ్యతిరేకిస్తున్నారు. ఆయనను అభ్యర్థిగా ఎంపిక చేయద్దని, పోటీ చేసినా ఓడిపోతారని అధిష్ఠానానికి చెబుతూ వచ్చారు.అయినా పార్టీ ఆయన్నే అభ్యర్థిగా ప్రకటించడంతో వ్యతిరేకించిన నాయకులకు సొంత మండలాల్లో తలెత్తుకోలేని పరిస్థితి ఏర్పడింది. సూళ్ళూరుపేటలోనూ సిట్టింగ్ ఎమ్మెల్యే సంజీవయ్యను కూడా మండల స్థాయి బలమైన నేతలు పలువురు వ్యతిరేకిస్తున్నారు. ఆయనకు మళ్ళీ టికెట్ ఇవ్వకూడదని చాలాకాలంగా బహిరంగ కార్యకలాపాలు నడుపుతున్నారు. కాదని టికెట్ ఇస్తే ఓడిస్తామని పార్టీని హెచ్చరించినా అభ్యర్థిగా ప్రకటించడంతో వ్యతిరేకించిన నేతలు నిరాశా నిస్పృహలకు లోనవుతున్నారు. సొంత మండలాల్లో అనుచరులకు సమాధానం చెప్పలేని పరిస్థితుల్లో సతమతమవుతున్నారు. ఈ మూడు నియోజకవర్గాల్లో అభ్యర్థులను తీవ్రంగా వ్యతిరేకించిన అసమ్మతి వర్గాలు ఇపుడు ఎలా వ్యవహరించబోతున్నాయో అని రాజకీయ వర్గాలతో పాటు ప్రజానీకం కూడా ఆసక్తిగా వేచి చూస్తోంది.

అమల్లోకి ఎన్నికల నియమావళి

- ఆఫీసుల్లో నేతల ఫొటోలు... కూడళ్ళలో ఫ్లెక్సీల తొలగింపు
- విగ్రహాలకు ముసుగులు
- ప్రధాన పార్టీల్లో పెరిగిన హడావిడి



తిరుపతిలో నేతల విగ్రహాలకు ముసుగులు



→ తిరుపతిలో ఇంకా తొలగని జగన్ సిద్ధం ఫ్లెక్సీలు

తిరుపతి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల షెడ్యూలు విడుదల కావడంతో జిల్లాలో సందడి పెరిగింది. అటు పార్టీలు, ఇటు యంత్రాంగం నిజానికి ఎన్నికలకు ఒకటి రెండు నెలలుగా సమాయత్తమవుతున్నాయి. కాకపోతే ఈసీ ముహూర్తం ప్రకటించడంతో అధికారికంగా ఎన్నికల వాతావరణం నెలకొంది. షెడ్యూలు వెలువడడంతోనే ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చింది. దీంతో జిల్లా అధికార యంత్రాంగం కోడ్ అమలుకు రంగంలోకి దిగింది. తొలుత కలెక్టరేట్‌లోని వివిధ శాఖల కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన సీఎం జగన్ ఫొటోలను తొలగించారు. తిరుపతి నగరంలోని పలు కూడళ్లలో ఏర్పాటు చేసిన అధికార పార్టీకి సంబంధించిన ఫ్లెక్సీలు, హోర్డింగులు, బ్యానర్లు వంటి వాటిని తొలగించే పనిలో పడ్డారు. సగానికి పైగా కూడళ్ళలో తీసివేశారు. రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు వేశారు. మరోవైపు ఎన్నికల నిర్వహణకు సంబంధించి సన్నద్ధతను జిల్లా యంత్రాంగం సమీక్షించుకునే పనిలో పడింది. శనివారం రాష్ట్ర సీఈవో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లాకు సంబంధించి ఎన్నికల విధులకు అందుబాటులో వున్న అధికారులు, ఉద్యోగుల సంఖ్యను, వారిలో ఏయే విధులకు ఎంత మందిని కేటాయించింది, రిజర్వులో వున్న వారి సంఖ్య వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఎన్నికల నోటిఫికేషన్ జారీ కావడానికి నెలకు పైగా గడువున్న కారణంగా అధికార యంత్రాంగం ప్రతి అంశాన్నీ ఒకటికి రెండు సార్లు పునస్సమీక్షించుకునేందుకు అవకాశం ఏర్పడింది.మరోవైపు జిల్లాలో టీడీపీ అసెంబ్లీ స్థానాలకు, వైసీపీ అసెంబ్లీ సహా ఎంపీ స్థానానికి కూడా అభ్యర్థులను ప్రకటించేశాయి. జనసేన కూడా ఏకైక సీటుకు అభ్యర్థిని ఖరారు చేసింది. దీంతో మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులూ ప్రచారానికి శ్రీకారం చుట్టేశారు.అసంతృప్తులను బుజ్జగించేందుకు, ప్రత్యర్థి పార్టీల నుంచీ అసంతృప్త నేతలను తమ పార్టీలో చేర్చుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (ఆదివారం) : సా. 6.32
సహరి (సోమవారం) : ఉ. 5.00

17.94 లక్షలకు చేరిన జిల్లా ఓటర్లు

- ఎన్నికల నిర్వహణకు రూ.9కోట్లు మంజూరు
- కోడ్ అమలుకు ప్రత్యేక బృందాలు
- చంద్రగిరి, తిరుపతిపై ప్రత్యేక దృష్టి



ఈవీఎంల పనితీరును పరిశీలిస్తున్న అధికారులు

తిరుపతి(కలెక్టరేట్),మార్చి 16: ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది. శనివారం షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో మోడల్ కోడ్ అమలు చేసే పనిలో పడింది. జిల్లాలో 2,130 పోలింగ్ కేంద్రాలుండగా మరో ఆరు పోలింగ్ కేంద్రాలకు అనుమతి కోసం ఈసీకి పంపారు. ఎన్నికల నిర్వహణకు సుమారు రూ.14కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదన పంపగా మొదటి విడతగా రూ.9కోట్లు మంజూరయ్యాయి.జిల్లాలో ఎన్నికల నిర్వహణకు దాదాపు 17,650మంది ఉద్యోగులను అందుబాటులో ఉంచారు. నగదు, మద్యం, కానుకల పంపిణీని అడ్డుకోవడానికి 41ఎంసీసీ టీమ్‌లు,76 ఫ్లయింగ్ స్క్వాడ్స్ 29 వీడియో సర్వేలెన్స్ టీమ్స్ , 61 ఎఫ్ఎస్‌టీ టీములను నియమించారు.నేటినుంచి ఈ టీములు రంగంలో దిగనున్నాయి.జిల్లాలో ఓటర్ల సంఖ్య 17,94,604కు చేరింది. వీరిలో మహిళలు 9,19,760మంది, పురుషులు 8,75,076 మంది, ఇతరులు 177మంది ఉన్నారు. జనవరి 22న విడుదల చేసిన జాబితాలో ఓటర్ల సంఖ్యకన్నా 15,546మంది పెరిగారు.ఇందుకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలు పెరగనున్నాయి. జిల్లాలో 2,130 పోలింగ్ కేంద్రాలుండగా తిరుపతి, చంద్రగిరిల్లో ఆరుచోట్ల ఓటర్ల సంఖ్య 1500దాటడంతో అనుబంధ పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ఈసీకి ప్రతిపాదనలు పంపారు.తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల్లో చోటు చేసుకున్న ఘటనలతో చంద్రగిరిలో ఇష్టానుసారం పోలింగ్‌కేంద్రాలను మార్చడం, దొంగ ఓట్లు విపరీతంగా నమోదు కావడంపై ఈసీకి టీడీపీ ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఈ రెండు నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కేంద్ర ఎన్నికల కమిషన్ కలెక్టర్‌ను ఆదేశించింది. దీంతో ఈ రెండు నియోజకవర్గాల్లో ప్రతి పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు.మీడియాలో వచ్చే ఎన్నికల కథనాలను పర్యవేక్షించడానికి కలెక్టరేట్‌లో సమాచార శాఖ ఆధ్వర్యంలో మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. పెయిడ్ న్యూస్‌ను గుర్తించడానికి 30మందిని నియమించారు.

జేసీ బాధ్యతల స్వీకారం



ధ్యానచంద్ర

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 16 : జాయింట్ కలెక్టర్‌గా ధ్యానచంద్ర శనివారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో నిష్పక్షపాతంగా వ్యవహరిస్తానని, ప్రజా సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇస్తానని అన్నారు. ఇక్కడ జేసీగా పనిచేస్తున్న శుభం బన్సల్ శాప్ ఎండీగా బదిలీ అయిన విషయం విదితమే. ధ్యానచంద్రకు ఆర్డీవో పెంచలకిషోర్, ఎస్డీసీ భాస్కర్‌నాయుడు, సూళ్లూరుపేట ఆర్డీవో చంద్రముని, కలెక్టరేట్ ఏవో నరసింహారావు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

చిన్న, సన్నకారు రైతుల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

రామచంద్రాపురం, మార్చి 16: చిన్న, సన్నకారు రైతుల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ప్రకృతి వ్యవసాయశాఖ పనిచేస్తుందని ఆ శాఖ డీపీఎం షణ్ముగం అన్నారు. ప్రకృతి వ్యవసాయశాఖ గుంటూరు కార్యాలయం నుంచి సీనియర్ అధికారి, మోడల్ మండల టీం లీడర్ రాము పలు గ్రామాల్లో పంటలను శనివారం క్షేత్రస్థాయిలో సందర్శించారు. అడిషనల్ డీపీఎం పట్టాభిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నానీ విజయం కోసం సమష్టి కృషి



రామచంద్రాపురం, మార్చి 16: చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానీని గెలిపించేందుకు సమష్టిగా కృషి చేద్దామని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పిలుపునిచ్చారు. శనివారం ఆర్సీపురంలో టీడీపీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ఆగడాలను కలిసికట్టుగా ఎదుర్కొందామన్నారు.పల్నాడు జిల్లా చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి వద్ద ఆదివారం జరగనున్న 'ప్రజాగళం' బహిరంగ సభకు మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. టీడీపీ నాయకులు జనార్దన చౌదరి, నరసింహారెడ్డి, ఉమాపతి నాయుడు, హరిప్రసాద్, బీజేపీ నాయకులు కాయం హరిప్రసాద్, మోహన్‌రెడ్డి, జనసేన పార్టీ అధ్యక్షుడు సంజీవ హరి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ

తిరుపతి(రూరల్),మార్చి16: మండల పరిధిలోని పలు పంచాయతీల్లో జగనన్న ఇళ్లస్థలాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను చంద్రగిరి వైసీపీ నియోజకవర్గ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి శనివారం అందజేశారు. ఎంపీపీ యశోద, వైస్‌ఎంపీపీ మాధవరెడ్డి, సర్పంచ్‌లు ప్రదీప్‌రెడ్డి, వెంకటరమణ, దామినేటి కేశవులు, ఎంపీటీసీలు, ఉపసర్పంచ్‌లు, వార్డుసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రచార పోస్టర్లు, ఫ్లెక్సీల తొలగింపు ప్రారంభం



గాంధీపురం పంచాయతీలో వాల్‌పోస్టర్లు, ఫ్లెక్సీలు తొలగిస్తున్న సిబ్బంది, పక్కనే ఎంపీడీవో రమేష్‌బాబు

తిరుపతి రూరల్,మార్చి16: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో తిరుపతి రూరల్ మండల పరిధిలోని గాంధీపురం పంచాయతీలో శనివారం సాయంత్రం గోడలకు అంటించిన వాల్‌పోస్టర్లు, ఫ్లెక్సీల తొలగింపు ప్రక్రియ చేపట్టారు. ఎంపీడీవో కె.రమేష్‌బాబు నేతృత్వంలో పంచాయతీ పరిధిలోని గోడలకు వైసీపీ అంటించిన వాల్‌పోస్టర్ల తొలగింపు ప్రక్రియ ప్రారంభించారు. కోడ్ అమలులోకి వచ్చిన గంటల వ్యవధిలోనే తొలగింపు ప్రారంభించడం స్వాగతించదగ్గపరిణామమని పలువురు చర్చించుకుంటున్నారు. సెక్రటరీ కె.కరుణశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కెశ్విన్ మోటార్స్ వార్షికోత్సవం



తిరుచానూరు, మార్చి 16: ప్రముఖ ఆటో మొబైల్స్ సంస్థ కెశ్విన్ గ్రూప్ ద్వితీయ వార్షికోత్సవం తిరుపతి రూరల్ మండలం తనపల్లి క్రాస్‌లో ఉన్న కల్యాణమండపంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా సంస్థ ఎండీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, సీఈవో వెంకట్, జీఎం విమల్ సిబ్బంది సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2వ వార్షికోత్సవం పురస్కరించుకుని టీవీఎస్ వాహనాలు, ఎంజీకార్లు కొనుగోలుపై వినియోగదారులకు రాయితీ ఇస్తామన్నారు. అలాగే తమ షోరూంలు రాయలసీమలోని తిరుపతి, నెల్లూరు, కడప, అనంతపురం, కర్నూల్‌జిల్లాల్లో ఉన్నాయని తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు.

కోదండరాముడికి కాసుల హారం



చంద్రగిరి, మార్చి 16: చంద్రగిరి కోదండరామాలయంలోని స్వామికి వెండి కాసుల హారాన్ని ఆలయ సిబ్బంది, భక్తులు అందజేశారు. ఈ హారం విలువ రూ2.65 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.సూపరింటెండెంట్ శ్రీనివాసులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునిహరిబాబు పాల్గొన్నారు.

కిటకిటలాడిన శ్రీవారిమెట్టు మార్గం

చంద్రగిరి, మార్చి 16: తిరుమల శ్రీవారిమెట్టు మార్గం శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం సెలవు కావడంతో ఒక్కసారిగా భక్తులు కాలినడకన తిరుమలకు పోటెత్తారు. శ్రీవారిమెట్టు మార్గంలో ప్రతి రోజూ కాలినడకన తిరుమలకు వెళ్ళే భక్తులకు దర్శనం టోకెన్లు రోజుకు 5 వేలు ఇస్తారు. అయితే శనివారం ఉదయం నుంచి శ్రీవారిమెట్టు మార్గం రద్దీగా ఉండటంతో అదనంగా మరో రెండు వేల టోకెన్లను పంపిణీ చేశారు. శ్రీవారిమెట్టు మార్గంలో భక్తులు రద్దీ పెరుగుతుండటంతో ప్రతి రోజూ పదివేల దర్శనం టోకెన్లను జారీ చేయాలని భక్తులు కోరుతున్నారు.

హడావుడిగా ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ

చంద్రగిరి, మార్చి 16: ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తారనే ఉద్దేశంతో శనివారం మధ్యాహ్నం జగనన్న ఇంటి రిజిస్ట్రేషన్ పత్రాలను అధికారులు, వైసీపీ నాయకులు హడావుడిగా పంపిణీ చేశారు. జగనన్న ప్రభుత్వంలో ఇంటి పట్టాలు తీసుకొన్నారు కనుక రానున్న ఎన్నికలలో వైసీపీకే ఓటు వేయాలని వైసీపీ ప్రజాప్రతినిధులు చెప్పడంతో లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేశారు.

ఏ కార్యక్రమం నిర్వహించాలన్నా పార్టీలకు అనుమతి తప్పనిసరి

చంద్రగిరి, మార్చి 16: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని, రాజకీయ పార్టీలు ఏ కార్యక్రమం నిర్వహించాలన్నా ముందస్తుగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనుమతి పొందాలని తహసీల్దార్ మారుతి అన్నారు. ప్రభుత్వ ఆస్తులపై రాజకీయ పార్టీలకు సంబంధించి పోస్టర్లు, ఫ్లెక్సీలు, గోడ రాతలు ఉంటే 24 గంటలలోగా తొలగించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. అదేవిధంగా ప్రైవేటు ఆస్తులపై, భవనాలపై రాజకీయ పోస్టర్లు, ఫ్లెక్సీలు, గోడరాతలు ఉండాలంటే కచ్చితంగా అనుమతి పొంది పెట్టుకోవచ్చునని తెలిపారు.

లోక్ అదాలత్‌లో 29 కేసుల పరిష్కారం

పాకాల,మార్చి 16: పాకాల జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జడ్జి జె. కీర్తన అధ్యక్షతన శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. క్రిమినల్, సివిల్, పెట్టికేసులు 29 పరిష్కరించారు. లోక్‌అదాలత్‌లో రూ.72,87,584లకు సంబంధించి వివాదాలు పరిష్కారమయ్యాయి.లోక్ అదాలత్ సభ్యుడు గౌరీశంకర్ రాజు, న్యాయవాదులు జి.గురుస్వామినాయుడు, చంద్రమోహన్, రెడ్డప్పనాయుడు పాల్గొన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

పాకాల, మార్చి 16: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మారసాని విజయబాబు తెలిపారు. చెన్నై శంకర్ నేత్రాలయ ఆసుపత్రి వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అవసరమైన వారికి శంకర్ నేత్రాలయ ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తారన్నారు.

తలకోన అటవీ ప్రాంతంలో ఆరని మంటలు

ఎర్రావారిపాలెం, మార్చి16: తలకోన అటవీప్రాంతం మూడురోజులుగా కాలిబూడిదవుతోంది. తలకోన సౌత్ బీట్‌లో మూడు రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. ఈ మంటలు క్రమేపి తలకోన సెంట్రల్ బీట్‌కు కూడా వ్యాపించాయి. తలకోన పేటులోని రాయి కాల్చిన కనుమ, త్రూవేలు గుండు తదితర అటవీ ప్రాంతానికి మంటలు విస్తరించాయి.

కూటమి పార్టీల నేతల నుంచీ ఆరణికి దక్కని మద్దతు


● కలిసేందుకు చేసిన యత్నాలకు లభించని స్పందన ● నేడు జనసేన పార్టీ పరిశీలకుడి రాక



తిరుపతిలోని సింగాలగుంటలో ఆరణి శ్రీనివాసులు ప్రచారం

తిరుపతి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జనసేన అసెంబ్లీ అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుకు కూటమి పార్టీల నేతల నుంచీ శనివారం కూడా మద్దతు దక్కలేదు.జనసేన అధిష్ఠానం అభ్యర్థిని ఖరారు చేసినప్పటి నుంచే టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు సహాయ నిరాకరణలో వున్నట్టు కనిపిస్తోంది.తిరుపతి టికెట్ కోసం ప్రయత్నాలు మొదలు పెట్టకముందే వ్యక్తిగతంగా కలసి సహకారం కోరి వుండాల్సిందన్న అభిప్రాయం ఆయా పార్టీల నుంచీ వినిపిస్తోంది.టికెట్ ఖరారు చేయించుకునే సందర్భంలోనైనా తిరుపతి నేతలను జనసేనాని సమక్షానికి రప్పించుకుని, వారితో సర్దుబాటు చేయించుకుని వుండాల్సిందన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. తమను సంప్రదించకుండా ఏకపక్షంగా బయటి వ్యక్తిని అభ్యర్థిగా ఎంపిక చేయడంపై ఇక్కడి నేతలు జనసేనానిపై అసంతృప్తితో వున్నారు.వారిని కలిసేందుకు, వారితో సర్దుబాటు చేసుకునేందుకు శ్రీనివాసులు ప్రయత్నిస్తున్నా ఫలితం కన్పించడం లేదు. శనివారం సింగాలగుంట నుంచీ శ్రీనివాసులు ఎన్నికల ప్రచారం ప్రారంభించగా జనసేన జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్ మాత్రమే ఆయన వెంట వున్నారు. ఈ నేపథ్యంలో తిరుపతిలో నెలకొన్న పరిస్థితులను తెలుసుకోవాలని జనసేన అధిష్ఠానం భావిస్తోంది. పార్టీ క్రమశిక్షణా సంఘం సభ్యుడు అజయ్ కుమార్‌ను పరిశీలకుడిగా నియమించింది. ఆయన నేడు తిరుపతి చేరుకుని ముఖ్యనేతలతో సమావేశం కానున్నారు.స్థానికంగా నెలకొన్న పరిస్థితులను పార్టీ అధిష్ఠానానికి నివేదించనున్నారు.టీడీపీ, బీజేపీ నేతల నుంచీ కూడా ఆరణి శ్రీనివాసులు నిరాదరణ ఎదుర్కొంటున్నారు. టీడీపీలో కోడూరు బాలసుబ్రమణ్యం మినహా మరెవరూ ఆయన్ను కలవలేదు. సుగుణమ్మను కలిసేందుకు యత్నించగా ఆమె అందుబాటులో లేరన్న సమాధానం వచ్చింది. నరసింహ యాదవ్ ఇంటికి వెళ్ళగా చంద్రబాబు పిలిపించి మాట్లాడితే తర్వాత చూస్తామని చెప్పినట్టు తెలిసింది. ఇక ఊకా విజయ్ కుమార్, జేబీ శ్రీనివాస్ వంటి నేతలు కూడా ఆగ్రహంగా వున్నట్టు సమాచారం. ఆర్సీ మునికృష్ణ, మబ్బు దేవనారాయణరెడ్డి, శ్రీధర్ వర్మ తదితర నేతలు కూడా ఆరణి శ్రీనివాసులుకు అందుబాటులోకి రాలేదు. బీజేపీ నేతలు సైతం అంటీముట్టనట్టుగా వున్నారు.

వైసీపీ వర్సెస్ వైసీపీ... ఫన్నీఫైట్.. !



తిరుపతి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుకు వ్యతిరేకంగా మరోసారి నగరంలో ఫ్లెక్సీలు ఏర్పాటయ్యాయి. ఆయనకు టికెట్ ఖరారు కావడంతో గత గురువారం పలుచోట్ల ఆరణి శ్రీనివాసులూ గో బ్యాక్ అంటూ ఫ్లెక్సీలు ఏర్పాటైన సంగతి తెలిసిందే. తాజాగా శనివారం మరోరకమైన ఫ్లెక్సీలు ప్రత్యక్షమయ్యాయి. అటు వైపు వైసీపీ అభ్యర్థి అభినయరెడ్డి, ఇటు వైపు జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు ఫొటోలు ముద్రించి వుండగా కింది వైపు ఇద్దరూ ఇటీవల గంగమ్మ గుడిలో ఎదురుపడి పరస్పరం పలకరించుకుంటున్న ఫొటో ముద్రించారు. పై భాగంలో తిరుపతిలో ఫన్నీ ఫైట్ అంటూ శీర్షిక పెట్టి వుండగా అభ్యర్థుల ఫొటోల కింద వైసీపీ వర్సెస్ వైసీపీ అని ముద్రించి వుంది.ఎన్నికల షెడ్యూలు వెలువడడంతో శనివారం మధ్యాహ్నం తర్వాత కోడ్ ఎఫెక్ట్‌తో మున్సిపల్ సిబ్బంది వీటిని తొలగించారు.

రూ.60కోట్ల రస్తా పోరంబోకు ఆక్రమణ

● పట్టాలు సృష్టించి న్యాయస్థానాల్లోనూ పోరాటాలు



మంగళం వద్ద పోరంబోకు భూముల్లో నిర్మిస్తున్న కట్టడాలు

మంగళం, మార్చి 16: కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములను దర్జాగా ఆక్రమించేస్తున్నారు. ఆ భూములకు తమవని నకిలీ పట్టాలూ సృష్టించేసి వాటితో కోర్టుకు సైతం వెళ్లి వాదించి ఎవరికో ఒకరికి దక్కిన తరువాత వాటాలు వేసి పంచుకోవడానికి సిద్ధమవుతున్నారు. మంగళం పరిధిలోని ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీలో మంగళం గ్రామరెవెన్యూ లెక్క దాఖలాలో 2.33 ఎకరాల రస్తా పోరంబోకు భూమి ఉంది. ఈ భూమిని తాము కొన్నామని అప్పటి తహసీల్దార్లు తమ పేరుతో పట్టాలిచ్చారని చెప్పుకుంటున్న రెండు వర్గాలు ప్రస్తుతం ఆ భూమి కోసం ఎంతకైనా తెగించడానికి సిద్ధపడుతున్నారు. ఇక్కడ నిర్మాణాలను చేపట్టారు. రాత్రికి రాత్రి చిన్న గదులు నిర్మించి, త్వరలోనే లేఅవుట్లు వేయడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. తమకు ప్రత్యర్థిగా ఉన్న మరో వర్గానికి అటువైపు రావద్దంటూ హెచ్చరిక కూడా చేసినట్లు తెలుస్తోంది. రస్తా పోరంబోకుగా ఉన్న దాదాపు 5 ఎకరాల ఈ భూమివిలువ సుమారు రూ.60కోట్ల వరకు ఉంటుందని చెబుతున్నారు. మరోపక్క ఈ భూమిని చట్టపరంగా తమ సొంతం చేసుకోవడానికి న్యాయస్థానంలో పరస్పరం కేసులు పెట్టుకుని, అధికారులు సైతం ఆ స్థలంలోకి రాకుండా చేయాలనే ప్రణాళికతో వెళ్తున్నట్లు తెలుస్తోంది. న్యాయస్థానం నుంచి ఆ భూమి ఎవరికో ఒకరికి దక్కితే ఆ తరువాత వాటాలు వేసుకోవడానికి సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం నిర్మాణం జరిగిన ప్రాంతంలో మాస్టర్‌ప్లాన్ రోడ్డువస్తుందన్న పక్కా సమాచారంతో ముందుగానే ఓ గది నిర్మించారనే వాదన వినిపిస్తోంది. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి ఈ భూమి ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

టీడీపీలో అసమ్మతి ప్రచారాలకు తెర

● ఎస్సీవీ, మునిరామయ్యలతో సుధీర్‌రెడ్డి భేటీ



ఎస్సీవీ నాయుడితో సుధీర్ రెడ్డి తదితరులు

శ్రీకాళహస్తి, మార్చి 16: శ్రీకాళహస్తి టీడీపీలో విభేదాలున్నాయంటూ జరిగిన ప్రచారం పూర్తి అవాస్తవమని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు ప్రకటించారు. రెండు రోజుల క్రితం టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థిగా బొజ్జల సుధీర్ రెడ్డి పేరును ప్రకటించిన విషయం తెలిసిందే. టికెట్ ఆశించిన ఎస్సీవీ నాయుడి వర్గం అసంతృప్తి ఎటువైపు దారితీస్తుందో అన్న ప్రచారం జోరుగా సాగింది.అయితే శనివారం ఎస్సీవీ ఇంటికి సుధీర్ రెడ్డి వచ్చారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, వెంకటగిరి, సత్యవేడు, తిరుపతి రూరల్ ప్రాంతాల్లో ఎస్సీవీ నాయుడికి మంచి పట్టుందన్నారు.సత్యవేడులో వైసీపీ నుంచి వచ్చిన వారికి తనను సంప్రదించకుండానే టికెట్ ప్రకటించడంపై ఎస్సీవీ నాయుడు కలత చెందిన విషయం వాస్తవమేనన్నారు.తనను ఆశీర్వదించి గెలిపిస్తే ఆయన అడుగుజాడల్లో పని చేస్తానని ప్రకటించారు. అలాగే ఆయనకు ఎమ్మెల్సీ లేదా రాజ్యసభ సభ్యత్వం వంటి గౌరవప్రద స్థానం కల్పించేందుకు పార్టీ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేస్తానని చెప్పారు.ఇక శ్రీకాళహస్తిలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులను కూడా కలిసి ఒక్కటిగా ముందుకు సాగుతామన్నారు.మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు మాట్లాడుతూ భవిష్యత్ కార్యాచరణ సమావేశం కేవలం తనతోపాటు తన వర్గం నాయకులకు టీడీపీ అధిష్ఠానం నుంచి భరోసా పొందడంపై చర్చించేందుకే అన్నారు. గత ఎన్నికల్లో బియ్యపు మధుసూదన రెడ్డిని గెలిపిస్తే తీవ్ర ద్రోహం చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ఓటమి కోసమే తాను అహర్నిశలూ శ్రమిస్తానని ప్రకటించారు. అనంతరం సుధీర్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే సత్రవాడ ముని రామయ్య ఇంటికి వెళ్లి తనను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన కూడా సానుకూలంగా స్పందించి ఎన్నికల్లో అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. మొత్తంగా శనివారం జరిగిన పరిణామాలతో టీడీపీలో అసమ్మతి ప్రచారాలకు తెరపడింది.సుధీర్‌రెడ్డి వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గురవారెడ్డి, నాయకులు మునిరాజ నాయుడు, విజయ్‌కుమార్, కంఠా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్థలాలిస్తామంటూ వైసీపీ నాయకుల ఎర!

● బెడిసికొట్టిన అధికార పార్టీ ప్లాన్



ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, పవిత్రారెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

రేణిగుంట, మార్చి 16: ఏర్పేడు మండలం పాగాలి రెవెన్యూలో జగనన్న ఇంటి స్థలాల కోసం 157ఎకరాలను సేకరించి శ్రీకాళహస్తి, ఏర్పేడు, రేణిగుంట మండలాల్లో పేదలకు కేటాయించారు.అయితే రేణిగుంట మండలంలోని లబ్ధిదారులకు ఇప్పటి వరకు స్థలాలు చూపలేదు. ఏర్పేడు మండలంలోని మేర్లపాక, దళితవాడ, కుమ్మరిగుంట ఎస్టీ కాలనీ, మేర్లపాక గ్రామంలోని రైతులకు 2004లో పట్టాలిచ్చారు. ఆ పొలాలను జగనన్న లేఅవుట్ కోసం అధికారులు తీసుకున్నారు. రైతులకు పరిహారం గిట్టుబాటు కాకపోవడంతో 11మంది రైతులు భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని కోర్టును ఆశ్రయించారు.ఎన్నికల కోడ్ అమలుకు సమయం దగ్గరపడడంతో రేణిగుంట ప్రజలకు స్థలాలను చూపుతామంటూ వైసీపీ ఎమ్మెల్యే కబురుపంపారు. వచ్చే ఎన్నికల్లో ఓట్ల కోసం కోర్టువివాదాల్లో ఉన్న ఆ భూముల్లోనే ప్లాట్ అలాట్ చేస్తామని శనివారం ఉదయం పట్టణానికి చెందిన లబ్ధిదారులను రేణిగుంట వైసీపీ నాయకులు వాహనాల్లో పాగాలికి తరలించారు. అయితే మిగిలిన మండలాల లబ్ధిదారులకూ తెలియడంతో వేలాదిమంది ఒకసారిగా అక్కడకు చేరుకున్నారు.నాయకులు కొన్ని ప్లాట్లకుమాత్రం సరిహద్దు రాళ్లు వేసి మిగిలినవి ఖాళీగా వదిలేశారు. ఖాళీ జాగాల వద్ద ఇంటిజాగా మ్యాపు, ప్లాట్ నెంబరు సంఖ్య తెలిపే బోర్డులు తగిలించి వెనుకఖాళీ జాగా మొత్తం మీదే అని చెప్పడంతో లబ్ధిదారుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. రేణిగుంట ఎంపీపీ హరిప్రసాద రెడ్డి, వైసీపీ మండల ఇన్‌ఛార్జి పవిత్రా రెడ్డి లబ్ధిదారులకు ఎంత చెప్పినా ప్రయోజనం లేకుండా పోయింది. ఆఖరికి రెండు రోజుల్లో ప్లాట్లకు రాళ్లు వేస్తామని చెప్పగా, ఎన్నికల కోడ్ వచ్చిన తరువాత ఎలా ఇస్తారని ప్రశ్నించారు. పిలిపించి మోసం చేస్తారా అని శాపనార్థాలు పెట్టారు. రాజకీయ లబ్ధి కోసం వైసీపీ నేతల ప్రయత్నం ఇలా బెడిసికొట్టింది.

టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటాం



భాకరాపేట, మార్చి 16: టీడీపీ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటామని టీడీపీ యువ నేత పులివర్తి వినీల్ అన్నారు. రెండు రోజుల క్రితం జంగావాండ్లపల్లెకు చెందిన టీడీపీ నాయకులు బాలాజీ, ప్రవీణ్ కుమార్ రెడ్డిపై వైసీపీ యువకులు దాడి చేసి వారి ద్విచక్ర వాహనాన్ని దహనం చేయడంతో సంఘటనా స్థలాన్ని పులివర్తి నాని సందర్శించి ప్రవీణ్‌కుమార్ రెడ్డికి నూతన బైకు కొనిస్తానని మాటిచ్చారు. శనివారం యువనేత పులివర్తి వినీల్ వారిని పరామర్శించి నూతన ద్విచక్ర వాహనాన్ని అందజేశారు. టీడీపీ నాయకులు బెల్లంకొండ మురళి, మదనమోహన, ఆర్వీ రమణారెడ్డి, మోహన్ రెడ్డి, మునస్వామి నాయుడు, కుమారస్వామిరెడ్డి, కృష్ణమూర్తి, చంద్రశేఖర్, గురుమూర్తి, విజయ్ శేఖర్ గౌడ్, ప్రతాప రెడ్డి, మల్లిఖార్జున రెడ్డి, గురుమూర్తి, బాలాజీ పాల్గొన్నారు.

నాని గెలుపు కోసం పూజలు

చంద్రగిరి, మార్చి 16: చంద్రగిరి మండలం కల్‌రోడ్డుపల్లె పంచాయతీ మిట్టూరులో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని గెలుపు కోసం గ్రామస్తులు రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కొమ్మినేని దామోదరనాయుడు ఆధ్వర్యంలో గ్రామస్తులకు స్వీట్లు పంచి పెట్టారు. రామాలయంలో ప్రత్యేక పూజలు చేసి రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావాలని మొక్కుకున్నారు.

వేడుకగా మారు పొంగళ్ళ సిద్ధ పూజోత్సవం



ఎర్రావారిపాలెం, మార్చి 16 : తలకోన సిద్ధేశ్వరస్వామి శివరాత్రి ఉత్సవాలు మారుపొంగళ్ళ సిద్ధపూజోత్సవంతో శనివారం ముగిశాయి. మహా శివరాత్రి నాడు రాలేని భక్తులు ఈ సిద్ధ పూజోత్సవంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. సిద్ధ పూజోత్సవంలో జంగమలు, గొల్లలు, అర్చకులు స్వామిని కీర్తిస్తుండగా సిద్ధులు తయారు చేసిన సిద్ధప్రసాదాన్ని వరపడిన మహిళా భక్తులు, స్వామి సేవకులకు, భక్తులకు వితరణ చేయడంతో సిద్ధపూజోత్సవం ముగిసినట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఈవో జయకుమార్, ట్రస్ట్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, సభ్యులు నాగిరెడ్డి, మంజుల, రాజేశ్వరి, మధుసూదన్ శెట్టి, గంగోజి, జయంత్ పాల్గొన్నారు.

● కోడ్ ఎఫెక్ట్

రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగు

ఫ్లెక్సీల తొలగింపు

కోడ్‌ను పటిష్టంగా అమలుపరుస్తాం : అదితి సింగ్







తిరుపతి, మార్చి 16(ఆంధ్రజ్యోతి) : ఎన్నికల కోడ్ అమలులో భాగంగా తిరుపతిలోని రాజకీయ నేతల విగ్రహాలు, ప్రభుత్వ కార్యాలయాల్లోని చిత్రపటాలకు ముసుగుపడింది. తిరుపతి నియోజకవర్గ ఎన్నికల అధికారి అదితి సింగ్ ఆదేశాల మేరకు సాయంత్రం 4 గంటల నుంచే కార్పొరేషన్ సిబ్బంది తుడా కూడలిలోని వైఎస్సార్ విగ్రహం, టౌన్‌క్లబ్‌లోని ఎన్టీఆర్ విగ్రహంతో పాటు ఇతర రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయడం మొదలుపెట్టారు. తుడా, నగరపాలక సంస్థ కార్యాలయంలోని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సీఎం జగన్మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మాజీ చైర్మన్ల ఫొటోలకు ముసుగు వేశారు. నగరమంతా విస్తృతంగా ఏర్పాటుచేసిన వైసీపీ ఫ్లెక్సీలను సైతం తొలగించారు. ఇక సిద్ధం పేరుతో వెలసిన పెద్దపెద్ద హోర్డింగ్‌లను ఆదివారం ఉదయం తొలగించనున్నారు. శిలాఫలాకలకు కూడా స్టిక్కర్లు అతికించనున్నారు. ప్రభుత్వ ఆస్తులపై ఉన్న రాజకీయ నాయకుల పోస్టర్లు, కటౌట్లు, హోర్డింగ్లు, పార్టీ జెండాలు తదితరాలను 24 గంటల్లోనూ, ఇతర ప్రాంతాల్లో ఉండేవాటిని 48 గంటల్లో తీసేయాలన్న ఎన్నికల నియమావళి మేరకు సిబ్బందికి ఆదేశాలిచ్చామని అదితి సింగ్ తెలిపారు. కోడ్‌ను పటిష్టంగా అమలుపరుస్తామని ఆమె 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు.



చెక్‌పోస్టులను తనిఖీ చేస్తున్న ఎస్పీ

అంతర్రాష్ట్ర చెక్ పోస్టుల్లో తనిఖీలు

తిరుపతి క్రైం మార్చి 16 : ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని జిల్లా పోలీస్ యంత్రాంగం ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ శనివారం తనిఖీ చేశారు. ప్రధానంగా సురుటుపల్లి, దాసుకుప్పం, మాదరపాకం, నాయుడు కుప్పం, అరూర్, తడ చెక్ పోస్టులను పరిశీలించి, సిబ్బంది పనితీరును సమీక్షించారు. ఇసుక, గ్రావెల్ అక్రమంగా తరలిపోకుండా చూడాలని ఆదేశించారు. 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డీఎస్పీలు భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసరావు, ట్రైనీ డీఎస్పీ సింధూప్రియ, ఎస్బీ సీఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో నేతల ఫొటోలు తొలగింపు

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 16: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో కలెక్టరేట్‌లో ప్రధాని, సీఎం, మంత్రుల ఫొటోలను శనివారం సాయంత్రం తొలగించారు. స్పందనహాల్‌లో సీఎం, మంత్రుల ఫొటోలు, ఫ్లెక్సీలను తొలగించారు. అధికారుల కార్యాలయల్లోనూ ముఖ్యమంత్రి ఫొటోను తొలగించారు.

వామ్మో ఎంత పెద్ద పామో..!



అలిపిరి నడకమార్గంలో నాగుపాము భక్తులను బెంబేలెత్తించింది. సుమారు ఆరడుగుల పాము 3,300 మెట్ల వద్దకు వచ్చింది. దాన్ని చూసిన భక్తులు భయంతో కేకలు వేస్తూ, పరుగులు తీశారు. కొంత సమయానికి అది దగ్గర్లో నేపాల్ భద్రతా సిబ్బంది బస చేసే షెడ్ లోపలికి ప్రవేశించింది. వెంటనే పాములు పట్టే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్ నాయుడికి సమాచారమిచ్చారు. ఆయన అక్కడికి చేరుకుని దాన్ని పట్టుకుని అవ్వాచారి కోనలో వదిలేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

నేషనల్ ఇన్‌స్పైర్‌కి మూడు ప్రాజెక్టుల ఎంపిక



తిరుపతి(విద్య), మార్చి 16 : జాతీయ స్థాయి ఇన్‌స్పైర్‌కి జిల్లా నుంచి మూడు ప్రాజెక్టులు ఎంపికైనట్లు జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్ పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా గంగవరం మండలంలోని మదర్‌థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ ప్రోగ్రామ్‌లో జాతీయ స్థాయికి 24 ప్రాజెక్టులు ఎంపిక కాగా ఇందులో జిల్లాకు చెందినవి మూడు ఉన్నట్లు తెలిపారు. దొరవారిసత్రం మండలం కల్లూరు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి వి.నిరూష రూపొందించిన ట్రోలీ ఫర్ సీవేజ్ క్లీనింగ్, రామచంద్రాపురం మండలం కమ్మపల్లె గవర్నమెంట్ హైస్కూల్ విద్యార్థి ఎం.వాణి రూపొందించిన కోకోనట్ డ్రిల్లర్ అండ్ బ్రేకర్, రేణిగుంట మండలం గుత్తివారిపల్లె జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి గొల్లపల్లి రేష్మ రూపొందించిన బాయిల్డ్ ఎగ్ సెల్ పీలర్ ప్రాజెక్టులు ఎంపికయ్యాయని వివరించారు. గైడ్ టీచర్లుగా పీవీ రమణయ్య(కల్లూరు జెడ్పీహెచ్ఎస్), ఎస్‌జే కామేశ్వరి (జీహెచ్ఎస్, కమ్మపల్లె), పి.మునిరెడ్డి(జెడ్పీహెచ్ఎస్, గుత్తివారిపల్లె) వ్యవహరించారని తెలిపారు. డీఈవో డాక్టర్ వి.శేఖర్ విద్యార్థులతో కలసి జేసీ ధ్యానచంద్రని మర్యాద పూర్వకంగా కలిశారు.

నేడు గ్రూప్-1 పరీక్ష

● 16 కేంద్రాల ఏర్పాటు

● హాజరుకానున్న 9,377 మంది అభ్యర్థులు

తిరుపతి(విద్య), మార్చి 16: గ్రూప్-1 పరీక్షను ఆదివారం తిరుపతిలోని పలు సెంటర్లలో నిర్వహించనున్నారు. ఇందుకోసం రెవెన్యూ అధికారులు తిరుపతి అర్బన్, రూరల్ ప్రాంతాల్లో 16 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 9,377 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. పేపర్-1, పేపర్-2 విధానంలో రెండు దఫాలుగా పరీక్ష జరుగనుంది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1 పరీక్ష ఉంటుంది. అభ్యర్థులు ఉదయం 9 నుంచి 9.45 గంటల లోపే పరీక్ష కేంద్రంలోకి ప్రవేశించాల్సి ఉంటుంది. ఇక మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగనున్న పేపర్-2 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 1.45 గంటల లోపు కేంద్రంలోకి చేరుకోవాలి. హాల్‌టికెట్‌తోపాటు ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీ తదితర గుర్తింపు కార్డులను తీసుకువెళ్లాల్సి ఉంటుంది. అభ్యర్థులు సమాచారం కోసం 90006 65565, 96769 28804లలో కంట్రోల్ రూమ్‌ను సంప్రదించవచ్చు.

ఆకాశాన్నంటుతున్న కందిపప్పు ధర

రెండు నెలల్లో క్వింటాల్‌కు రూ.300 నుంచి 350 పెరిగిన వైనం - ఉత్పత్తి తగ్గడమే కారణం

తిరుపతి(నేరవిభాగం), మార్చి 16 : కందిపప్పు ధర ఆకాశాన్నంటుతోంది. ఉత్పత్తి తగ్గడం, డిమాండ్ పెరగడంతో ధర రోజురోజుకూ పెరుగుతోంది. గడిచిన రెండు నెలల్లో క్వింటాల్(100కిలోలు) పై రూ.300 నుంచి రూ.350వరకు పెరిగింది. ప్రస్తుతం మార్కెట్‌లో మేలు రకం కందిపప్పు కిలో రూ.150 వరకు పలుకుతోంది. గతేడాది మార్చిలో ఇదే రకం రూ.120 నుంచి రూ.125 వరకు ఉండేది. జిల్లాకు అవసరమైన కందిపప్పును కర్నూలు, పల్నాడు, ప్రకాశం, సత్యసాయి, అనంతపురం తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటూ ఉంటారు. పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఈ సీజన్‌లో 400 టన్నులు దిగుమతి చేసుకోవాలని నిర్ణయించింది. అయితే పంట దిగుబడి తగ్గిపోవడంతో ఆ మేరకు సేకరించలేకపోతోంది. కేవలం 225 టన్నులు మాత్రమే వస్తోందని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజా రఘువీరా చెబుతున్నారు. ఈ క్రమంలోనే రేషన్ షాపులకు సైతం అవసరమైన కందిపప్పు సరఫరా కావడం లేదని తెలిపారు. కాగా, డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని కొంతమంది వ్యాపారులు బ్లాక్ దందాకు తెరతీశారు. పరిమితికి మించి గోడౌన్‌లలో నిల్వ ఉంచారని తెలుస్తోంది. ముఖ్యంగా వికోట, సత్యవేడు, ఊత్తుకోట, గుడిపాల ప్రాంతాల్లో దాచి ఉంచినట్లు సమాచారం. దీనిపై విజిలెన్స్ అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.



రోడ్ల నిర్వహణ గాలికి వదిలేశారు

నవీన్‌కుమార్‌రెడ్డి

తిరుపతి (రవాణా), మార్చి 16 : మాస్టర్‌ప్లాన్ రోడ్ల నిర్వహణను కార్పొరేషన్ అధికారులు గాలికొదిలేశారని రాయలసీమ పోరాట సమితి కన్వీనర్ నవీన్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో మహనీయుల విగ్రహాలు, సంగీత వాయిద్య నమూనాలు, నూతనంగా వేసిన రోడ్లలో మహనీయుల పేర్లతో ధగధగలాడే బోర్డులు ఏర్పాటు చేశారే తప్పా నిర్వహణ బాధ్యతను గాలికి వదిలేశారని పేర్కొన్నారు. ఆకతాయిలు నేమ్ బోర్డులను, నమూనాలను ధ్వంసం చేస్తున్నారని తెలిపారు. ఎస్వీ మ్యూజిక్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన ఫైలాన్ తబలా, గిటార్ నమూనాలను పగులగొట్టారని తెలిపారు. అలిపిరి బైపాస్ రోడ్డు ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన పెడస్టల్ స్టాడింగ్ లైట్స్ పగులగొట్టారని వివరించారు. ఎమ్మార్‌పల్లి సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ దండియాత్ర ప్రాంగణం పిచ్చిమొక్కలతో కళావిహీనంగా మారిందని పేర్కొన్నారు. నమూనా విగ్రహాలకు అయిన ఖర్చుపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

కార్మిక చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



తిరుపతి సెంట్రల్, చార్చి 16: క్షేత్ర స్థాయిలో కార్మిక చట్టాలు అమలు చేయాలంటే కార్మిక శాఖ అధికారులు, కార్యనిర్వాహక సిబ్బంది ముందుగా వాటిపై అవగాహన పెంచుకోవాలని ఆ శాఖ విశ్రాంత ఉప కమిషనర్ అఖిల్ అన్నారు. అన్నమయ్య మార్గంలోని రాస్ ప్రధాన కార్యాలయంలో శనివారం ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్మిక శాఖ అధికారులకు, సిబ్బందికి చట్టాలపై అవగాహన కల్పించారు. ఉప కార్మిక కమిషనర్ బాలునాయక్ ప్రారంభించిన ఈ సదస్సులో అఖిల్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మారుతున్న కార్మిక చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. కనీస వేతనాల అమలు తీరుతెన్నులపై అవగాహన చేసుకుని క్షేత్రస్థాయిలో అమలు చేయాలని సూచించారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు తీసుకోవాల్సిన అంశాలపై పలు సూచనలు చేశారు.

వెంకన్న సేవలో ప్రముఖులు

తిరుమల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్ కోనా రఘుపతి, తిరుపతి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరని శ్రీనివాసులు, సినీ నిర్మాత అశ్వనీదత్, సంగీత దర్శకుడు తమన్, హీరో నాగ అశ్విన్ బాబు, ఎమ్మెల్సీలు పోతుల సునీత, సిపాయి సుబ్రహ్మణ్యం ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.



అశ్వినీదత్ - తమన్, అశ్విన్ బాబు

ఆర్టీసీ వాకాడు డిపో మేనేజర్ మృతి

తిరుపతి(ఆర్టీసీ), మార్చి 16 : ఆర్టీసీ వాకాడు డిపో మేనేజర్ ఎస్.మధుశేఖర్‌రెడ్డి శనివారం గుండెపోటుతో స్విమ్స్ ఆస్పత్రిలో మృతి చెందారు. ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి ఆస్పత్రికి చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. మధుశేఖర్‌రెడ్డి భౌతికకాయానికి నివాళి అర్పించారు. డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి, సీఎంఈ నరసింహులు ఆయన వెంట ఉన్నారు.

శోభాయమానం.. డిజిటల్ స్క్రీన్

తిరుపతి అర్బన్, మార్చి 16: పూర్ణకుంభం కూడలిలో ఏర్పాటు చేసిన డిజిటల్ స్క్రీన్ శోభాయమానంగా ఉంది. నగరానికి ముఖ ద్వారమైన పూర్ణకుంభం కూడలిని నగరపాలక సంస్థ నయనానందంగా తయారు చేస్తోంది. ఇందులో భాగంగా పదడుగుల ఎత్తులో డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు చేసి అందులో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవమూర్తులు వివిధ అలంకరణలో కనిపిస్తున్నట్లు ఏర్పాటు చేశారు. ఇదికూడలి మీదుగా రాకపోకలు సాగించే ప్రయాణికులు, పాదచారులు, ఇతరులను ఆకట్టుకుంటోంది.



పూర్ణకుంభం కూడలిలో డిజిటల్ స్క్రీన్ బోర్డు

ట్రాఫిక్ డీఎస్పీగా రమణకుమార్



తిరుపతి(నేరవిభాగం), మార్చి 16 : తిరుపతి ట్రాఫిక్ డీఎస్పీగా రమణకుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో సీఐగా, డీఎస్పీగా పనిచేశారు. తిరుపతి ఎస్పీ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ సెల్ 2లో డీఎస్పీగా పనిచేస్తూ బదిలీపై తిరుపతి ట్రాఫిక్‌కు వచ్చారు. ఎస్సీ, ఎస్టీ సెల్ 1లో డీఎస్పీగా పనిచేసిన నరసింగప్పను దిశ డీఎస్పీగా బదిలీ చేస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు డీఎస్పీగా పనిచేసిన కాటమరాజును పోలీస్ కంట్రోల్ రూంకు బదిలీ చేశారు.

వడ్డెర్లకు అన్యాయం

తిరుపతి(కపిలతీర్థం), మార్చి 16 : రాష్ట్రంలో 25 లక్షలకు పైగా ఓట్లు కలిగిన వడ్డెర కులస్థులకు టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ సీటు ఇవ్వకపోవడం బాధాకరమని టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధికార ప్రతినిధి వేముల సుబ్బారావు ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన శనివారం మాట్లాడుతూ 30 ఏళ్లుగా వడ్డెర కులస్థులు టీడీపీనే నమ్ముకుని ఉన్నారని, అలాంటి వారికి అన్యాయం చేయడం పట్ల తన పదవికి రాజీనామా చేస్తున్నానని తెలిపారు. రాష్ట్ర అసంఘటిత కార్మిక సంఘం జనరల్ సెక్రటరీ విజయ్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజు రెడ్డెప్ప పాల్గొన్నారు.

ఆరుగురు హోంగార్డులకు చెక్కు అందజేత

తిరుపతి(నేరవిభాగం), మార్చి 16 : జిల్లాలోని ఆరుగురు హోంగార్డులకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.29,993 మంజూరు చేశారు. ఈ మేరకు వారికి ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ శనివారం చెక్కు అందజేశారు. అందుకున్న వారిలో శేఖర్, జయప్రకాష్, వెంకటయ్య, నందకుమార్, మోహన్‌కుమార్, రమాదేవి ఉన్నారు. హోం గార్డుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని ఎస్పీ తెలిపారు.



హోం గార్డులకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ

ఆకట్టుకున్న నగర సంకీర్తన



తిరుపతి (కల్చరల్), మార్చి 16: రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో శనివారం ఉదయం నగరసంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. 60 మందికి పైగా భజన కళాకారులు బండ్ల వీధి రామాలయం నుంచి గోవిందరాస్వామి ఆలయ మాడవీధులలో హరినామ సంకీర్తన చేశారు. ఈ కార్యక్రమంలో గుండాల గోపినాథ్, శాంబోలు హరనాథ్, కేఎస్‌రాజా పాల్గొన్నారు.

సోషలిస్టు యూనిట్ సెంటర్ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా లక్ష్మి

తిరుపతిసెంట్రల్, మార్చి 16 : సోషలిస్టు యూనిట్ సెంటర్ ఆఫ్ ఇండియా (కమ్యూనిస్టు) పార్టీ తిరుపతి నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు మహిళా ఉద్యమ నాయకురాలు ఎల్.ఎస్.లక్ష్మి శనివారం ప్రకటించారు. తమ పార్టీ అభ్యర్థులు 19 రాష్ట్రాల్లో, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో 151 పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేస్తారని ఆమె తెలిపారు. ఏపీలో 4 లోక్‌సభ, 5అసెంబ్లీ స్థానాలకు పోటీ చేస్తున్నట్లు చెప్పారు.



ఆరణి శ్రీనివాసులు ప్రచారం

తిరుపతి అర్బన్, మార్చి 16: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తిరుపతి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు నగరంలోని సింగాలగుంటలో లాంచనంగా ప్రచారం ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి తనకే ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ ఆధ్యాత్మిక నగరం తిరుపతిని అభివృద్ధి బాట పట్టించేందుకు కృషి చేస్తానన్నారు. జనసేన అధ్యక్షుడు పి.హరిప్రసాద్, స్థానిక నాయకులు చందు, రాజేష్‌యాదవ్, భాను, కృష్ణయ్య, ఆనంద్, కుమార్, దిలీప్, సుబ్రహ్మణ్యం, మధులత, దివ్య, శిరీష, లక్ష్మి, కోకిల, జయంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌ను కఠినంగా అమలు చేయండి

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 16 : ఎన్నికల కోడ్‌ను కఠినంగా అమలు చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. విజయవాడ నుంచి ఆయన శనివారం జిల్లా అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. ఎన్నికల షెడ్యూల్ విడులైనందున కోడ్ అమల్లోకి వచ్చిందని, ఈ విషయంలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అన్నారు. కోడ్ ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం గ్రూప్-1 పరీక్షలు, భూసేకరణ, కరువు మండలాల్లో తాగునీరు, ఆరోగ్యం, వైద్యం, కుటుంబ సంక్షేమం, జనన, మరణ నమోదు చట్టంపై కలెక్టర్ లక్ష్మీశ, ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో సమీక్షించారు.

తిరుపతి వెళ్లే మెమో రైళ్లు పాక్షిక రద్దు

పెరంబూర్, మార్చి 16: స్థానిక మూర్ మార్కెట్ కాంప్లెక్, విల్లుపురం, అరక్కోణం నుంచి తిరుపతి వెళ్లే మెమో సబర్బన్ రైళ్లను ఆది, సోమవారాలు (ఈనెల 17, 18 తేదీలు) పాక్షికంగా రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

- నెం.06727 మూర్‌మార్కెట్ కాంప్లెక్స్ నుంచి ఉదయం 9.50 గంటలకు బయల్దేరే మెమో ఎక్స్‌ప్రెస్ తిరుపతికి బదులుగా రేణిగుంట వరకు మాత్రమే నడుస్తుంది. అలాగే, నెం.06728 తిరుపతి నుంచి మధ్యాహ్నం 1.35 గంటలకు మూర్ మార్కెట్ కాంప్లెక్స్‌కు బయల్దేరే మెమో ఎక్స్‌ప్రెస్ తిరుపతికి బదులుగా రేణిగుంట నుంచి బయల్దేరుతుంది.
- నెం.16854 విల్లుపురం నుంచి ఉదయం 5.35 గంటలకు తిరుపతికి వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు తిరుపతికి బదులుగా కాట్పాడి వరకు మాత్రమే నడుస్తుంది. అలాగే నెం.16853 తిరుపతి నుంచి మధ్యాహ్నం 1.40 గంటలకు విల్లుపురం బయల్దేరే ఎక్స్‌ప్రెస్ రైలు తిరుపతికి బదులుగా కాట్పాడి నుంచి బయల్దేరుతుంది.
- నెం.06753 అరక్కోణం నుంచి ఉదయం 9.15 గంటలకు తిరుపతికి బయల్దేరే మెమో ఎక్స్‌ప్రెస్ తిరుపతికి బదులుగా రేణిగుంట వరకు మాత్రమే నడుస్తుంది. అలాగే నెం.06754 తిరుపతి నుంచి మధ్యాహ్నం 3.45 గంటలకు అరక్కోణం బయల్దేరే మెమో ఎక్స్‌ప్రెస్ రైలు తిరుపతికి బదులుగా రేణిగుంట నుంచి బయల్దేరుతుందని అధికారులు తెలిపారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.39 కోట్లు

తిరుమల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల వెంకన్న హుండీ ఆదాయం రూ.3.39 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు వచ్చిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 66,322 మంది భక్తులు దర్శించుకున్నారు. 24,672 మంది తలనీలాలు సమర్పించారు.

పొట్టి శ్రీరాములు జీవితం ఆదర్శనీయం

తిరుపతి(కలెక్టరేట్)/మంగళం, మార్చి 16: పొట్టి శ్రీరాములు జీవితం ఆదర్శనీయమని తిరుపతి జిల్లా రెవెన్యూ అధికారి పెంచలకిషోర్ అన్నారు. అమరజీవి జయంతిని పురస్కరించుకుని శనివారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి అధికారులు పుష్పాంజలి ఘటించారు. డీఆర్వో మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగ ఫలమే తెలుగు రాష్ట్రమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి భాస్కర్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారులు జ్యోత్స్న, బీసీ హాస్టల్ వెల్ఫేర్ సిబ్బంది పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్సు కార్యాలయంలో..: తిరుపతి టాస్క్‌ఫోర్సు కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పుష్పాంలి ఘటించారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాన్ని కొనియాడారు. డీఎస్పీ చెంచుబాబు, ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డి, సీఐలు శ్రీనివాసులు, సురేష్ పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..

జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. ఆంధ్ర జాతి కోసం ఆయన చేసిన త్యాగాన్ని స్మరించుకున్నారు. అదనపు ఎస్పీలు వెంకట్రావు, కులశేఖర్, విమలకుమారి, ఏఆర్ ఏఎస్పీ శ్రీనివాసరావు, ఏవో నందకిషోర్ డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఆర్వో పెంచలకిషోర్

ఏడీఎంఈలుగా ఇద్దరికి పదోన్నతులు

తిరుపతి(వైద్యం), మార్చి 16 : వైద్య విద్యా, కుటుంబ సంక్షేమ శాఖలో ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న ఇద్దరికి అదనపు వైద్య విద్యా సంచాలకులు(ఏడీఎంఈ)గా పదోన్నతి ఇస్తూ డీఎంఈ డాక్టర్ నరసింహం శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆరుగురు ప్రొఫెసర్లకు పదోన్నతులు కల్పించగా వారిలో ఎస్వీ వైద్య కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి, రుయాస్పత్రి సూపరింటెం డెంట్ డాక్టర్ జి.రవిప్రభు, ఎస్వీవైద్య కళాశాల చిన్నపిల్లల విభాగం ప్రొఫెసర్ డాక్టర్ డి.మల్లీశ్వరి ఉన్నారు. వీరిలో డాక్టర్ రవిప్రభుకు రుయాస్పత్రి సూపరిం టెండెంట్‌గా పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ అదే స్థానంలో ఉంచగా డాక్టర్ మల్లీశ్వరిని పులివెందులలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా నియమించారు.



డాక్టర్లు రవిప్రభు - మల్లీశ్వరి

నేడు నామినికి మాండలిక బ్రహ్మ అవార్డు ప్రదానం

తిరుపతి (కల్చరల్), మార్చి 16: ప్రముఖ రచయిత నామిని సుబ్రహ్మణ్యం నాయుడికి ఆదివారం మాండలిక బ్రహ్మ అవార్డు ప్రదానం చేయనున్నారు. రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యవస్థాపకులు గల్లా రామచంద్ర నాయుడు, గల్లా అరుణ కుమారి, రమాదేవి ఈ అవార్డు ప్రదానం చేస్తారు. కరకంబాడీలోని అమరరాజా ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు శ్వేత సంచాలకులు భూమన్ అధ్యక్షతన నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ప్రజాకవి గోరటి వెంకన్న, ప్రముఖ పాత్రికేయుడు తాడి ప్రకాష్, గాయకుడు పుట్టా పెంచలదాసు హాజరుకానున్నారు.

జాతీయ లోక్ అదాలత్ విజయవంతం

తిరుపతి(లీగల్), మార్చి 16: తిరుపతి కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ విజయవంతమైంది. మండల న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, మూడవ అదనపు జిల్లా జడ్జి ఎం.గురునాథ్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కేసుల పరిష్కారం కోసం 8 బెంచ్‌లు ఏర్పాటు చేశారు. ఒక్కో బెంచ్‌లో ఒక్కో న్యాయమూర్తి, న్యాయవాది, కోర్టు సిబ్బంది ఆధ్వర్యంలో ఇరు వర్గాల న్యాయవాదులు, కక్షిదారులు సమక్షంలో కేసులను రాజీ చేశారు.

బీఆర్‌ఎస్‌కు ఆర్కాట్ కృష్ణప్రసాద్ రాజీనామా

తిరుపతిసెంట్రల్, మార్చి 16: బీఆర్‌ఎస్ రాష్ట్ర అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు తిరుపతికి చెందిన ఆర్కాట్ కృష్ణప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక హోదాకు సహకారం, విశాఖ ఉక్కు, కాపులకు న్యాయం చేస్తారన్న విశ్వాసంతో పార్టీలో చేరినట్లు తెలిపారు. తెలంగాణలో పార్టీ ఓటమి పాలు కావడంతో ఏపీలో నాయకులను పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. అందుకే పార్టీ నుంచి వైదొలిగినట్లు చెప్పారు.

తెలుగువారి ఆత్మగౌరవం పొట్టిశ్రీరాములు

తిరుపతి (కల్చరల్), మార్చి 16 : తెలుగు వారి ఆత్మగౌరవం కోసం ప్రాణాలు అర్పించిన పొట్టిశ్రీరాములు ఆదర్శనీయుడని టీటీడీ మ్యూజియం అధికారి నాగోలు కృష్ణారెడ్డి అన్నారు. శనివారం ఉదయం అన్నమాచార్య కళామందిరంలో పొట్టిశ్రీరాములు 123వ జయంతిని ఘనంగా నిర్వహించారు. టీటీడీ నిర్వహించిన ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణారెడ్డి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు గాంధీ మార్గంలో పయనించి, హరిజనోద్ధరణకు అవిశ్రాంతంగా కృషి చేశారన్నారు. తెలుగువారికి విడిగా రాష్ట్రం కావాలని చెన్నైలో నిరాహార దీక్ష చేపట్టి 56 రోజుల తర్వాత ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. దీంతో అప్పటి నెహ్రూ ప్రభుత్వం దిగివచ్చి తెలుగు వారికి కర్నూలు కేంద్రంగా ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు నిర్ణయం తీసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చీఫ్ పీఆర్వో టి.రవి, సంక్షేమ విభాగం డిప్యూటీ ఈవో స్నేహలత, రమేష్ పాల్గొన్నారు. సభ ప్రారంభంలో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి, నివాళి అర్పించారు. ఆహ్వాన పత్రికలో పేర్లు ముద్రించిన వారు ఎవరూ ఈ సభకు హాజరుకాకపోవడం విమర్శలకు తావిచ్చింది. అమరజీవికి వీరు ఇచ్చే విలువ ఇదేనా అని పలువురు చర్చించుకోవడం కనిపించింది.



సమావేశంలో మాట్లాడుతున్న నాగోలు కృష్ణారెడ్డి

జనసేన డివిజన్ అధ్యక్షుల నియామకం

తిరుపతి అర్బన్, మార్చి 16 : జనసేన పార్టీ తిరుపతిలోని 50 డివిజన్ల అధ్యక్షులను నియమించింది. ఈ మేరకు పార్టీ పట్టణాధ్యక్షుడు రాజారెడ్డి శనివారం ప్రకటన విడుదల చేశారు. డివిజన్ వరుసక్రమంలో జి.వంశి, టి.బాబ్జి, డి.హేమకుమార్, కె.పార్థు, ఎం.పురుషోత్తం రాయల్, కె.హేమంత్, ఎ.సాయికుమార్, ఎస్.రవి, పి.మణికంఠ, ఎస్.పవన్‌కుమార్-కౌశిక్, ఎన్.పరంధామరెడ్డి, ఆర్.కిషోర్‌రెడ్డి, సి.పవన్‌కుమార్, ఆర్.రమేష్‌రెడ్డి, ఎ.బలరామకృష్ణ, షేక్ షరీఫ్, ఎస్.మనోజ్‌కుమార్, వి.విజయ్-రాజేష్, ఆర్.హిమవంత్, హరినాథ్‌నాయక్, బి.రాజేష్‌నాయక్, గిరి, పి.కిరణ్, ఆర్.లోహిత్, హేమలత, ఎల్.మోహన్ రాయల్, జి.ఆదికేశవులు, జి.ఎస్.రమేష్‌కుమార్, డి.మణికంఠ, కోమల్‌బాబు, ఎస్.వి.సాయి, కె.దినేష్‌జైన్, కె.బాలాజీ, ఎం.బాలాజీ, టి.రాజేష్‌ఆచారి, పి.వినోద్, టి.పురుషోత్తం, చందు, ఎం.కిరణ్‌కుమార్, డి.సుబ్బారావు, ఎన్.బాబు, బి.మునస్వామి, పి.వెంకటరమణ, వి.సాయిదేవ్‌యాదవ్, మోహన్, వి.సుధ, ఎన్.పురుషోత్తం, ఎన్.సురేష్, ఆర్.వడివేలు, సి.హెచ్.కిశోర్‌రాయల్ ఉన్నారు.

ఘనంగా క్రేడార్స్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 16: ఎస్వీ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో క్రేడార్స్-2కె24 కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డి ప్రారంభించారు. విద్యార్థులు పోటీ ప్రపంచంలో రాణించడానికి అన్ని విధాలుగా సమాయత్తం కావాలని కోరారు. అనంతరం విద్యార్థులకు క్రీడా, సాంస్కృతిక, టెక్నికల్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రిన్సిపాల్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ దామోదరరెడ్డి, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి సుధారాణి బహుమతులు అందజేసి అభినందించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సీనియర్ ప్రొఫెసర్ మల్లికార్జునరావు పాల్గొన్నారు.



పాల్గొన్న వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డి

రేపటి నుంచి రీసెర్చ్ మెథడాలజీపై కోర్సు ప్రారంభం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 16 : ఎస్వీయూ ఆర్ట్స్ కాలేజీ పరిధిలో రీసెర్చ్ మెథడాలజీపై వారం పాటు ప్రత్యేక కోర్సు నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డి ఈ కోర్సును ప్రారంభించనున్నారు. పరిశోధనా విధానంపై పీహెచ్‌డీ స్కాలర్లకు అవగాహన కల్పిస్తారు. ఆర్ట్స్ కాలేజీ పరిధిలోని అన్ని విభాగాలకు చెందిన పీహెచ్‌డీ స్కాలర్లు తప్పనిసరిగా హాజరుకావాలని అధికారులు కోరారు. ఈ మేరకు వర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ పద్మనాభం, వైస్ ప్రిన్సిపాల్ శ్యాంమోహన్‌డేవిడ్‌రాజు తెలిపారు.

సంగీతంతో మానసిక ఆరోగ్యం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 16 : సంగీతంతో మనిషి మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని జాతీయ సంస్కృత యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. పద్మావతి యూనివర్సిటీ సంగీత, నృత్య విభాగంలో రెండు రోజులుగా నిర్వహించిన జాతీయ సదస్సు ముగింపు సభ శనివారం నిర్వహించారు. వీసీ కృష్ణమూర్తి మాట్లాడుతూ శిశుర్వేత్తి, పశుర్వేత్తి, వేత్తిగాన రసం ఫణి అనే శ్లోకాన్ని గుర్తు చేశారు. సంగీతం సకల జీవులను ఆహ్లాదమయం చేస్తుందని అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ సంగీతం పట్ల మక్కువ పెంచుకోవాలన్నారు. తద్వారా మానసిక ప్రశాంతతను పొందాలని ఆకాంక్షించారు. రెండు రోజుల పాటు నిర్వహించిన సదస్సులో భాగంగా చేపట్టిన సమాంతర సదస్సుల్లో 32 పరిశోధనా పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ శైలేశ్వరి, కో-కన్వీనర్ ప్రొఫెసర్ యు.హిమబిందు పాల్గొన్నారు.



కార్యక్రమంలో విద్యాపీఠం వీసీ కృష్ణమూర్తి

సైబర్ నేరగాడి అరెస్టు

తిరుపతి క్రైం మార్చి 16 : ఆన్‌లైన్ ద్వారా మోసాలకు పాల్పడుతున్న నేరగాడిని శనివారం తిరుపతి యూనివర్సిటీ పోలీసులు అరెస్టు చేశారు. తిరుపతి సీఐడీ పోలీసుల వివరాల మేరకు.. తిరుపతికి చెందిన మరిచర్ల బాలాజీ ఓఎల్ఎక్స్‌లో పాత మొబైల్ ఫోన్లు అమ్మే నిమిత్తం ప్రకటనలు పోస్టు చేస్తాడు. ఫోన్ కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్న వ్యక్తిని నేరుగా కలిసి ఫోన్ చూడమని చెబుతాడు. అవతలి వ్యక్తికి ఫోన్ నచ్చితే తను చెప్పిన నంబరుకు యూపీఐ ద్వారా నగదు బదిలీ చేయించుకుంటాడు. నగదు బదిలీ అయిన తర్వాత ఈ విషయం ఎవరికీ చెప్పవద్దని, ఇప్పుడే ఫోన్ తీసుకుని వస్తానని చెప్పి అక్కడి నుంచి ఉడాయిస్తున్నాడు. తర్వాత సదరు నంబర్‌ను బ్లాక్ చేస్తున్నాడు. ఇదే తరహాలో మోసపోయిన షేక్ ఫయాజ్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు బాలాజీని పట్టుకుని విచారించగా అతనిపై 23కేసులు ఉన్నట్లు సైబర్ క్రైం పోర్టల్ ద్వారా పోలీసులు గుర్తించారు.



బాలాజి

నేడు గ్రూప్-1 పరీక్ష

● 16 కేంద్రాల ఏర్పాటు
● హాజరుకానున్న 9,377 మంది అభ్యర్థులు

తిరుపతి(విద్య), మార్చి 16: గ్రూప్-1 పరీక్షను ఆదివారం తిరుపతిలోని పలు సెంటర్లలో నిర్వహించనున్నారు. ఇందుకోసం రెవెన్యూ అధికారులు తిరుపతి అర్బన్, రూరల్ ప్రాంతాల్లో 16 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 9,377 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. పేపర్-1, పేపర్-2 విధానంలో రెండు దఫాలుగా పరీక్ష జరుగనుంది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1 పరీక్ష ఉంటుంది. అభ్యర్థులు ఉదయం 9 నుంచి 9.45 గంటల లోపే పరీక్ష కేంద్రంలోకి ప్రవేశించాల్సి ఉంటుంది. ఇక మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగనున్న పేపర్-2 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 1.45 గంటల లోపు కేంద్రంలోకి చేరుకోవాలి. హాల్‌టికెట్‌తోపాటు ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీ తదితర గుర్తింపు కార్డులను తీసుకువెళ్లాల్సి ఉంటుంది. అభ్యర్థులు సమాచారం కోసం 90006 65565, 96769 28804లలో కంట్రోల్ రూమ్‌ను సంప్రదించవచ్చు.

రేపటి నుంచి రీసెర్చ్ మెథడాలజీపై కోర్సు ప్రారంభం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 16: ఎస్వీయూ ఆర్ట్స్ కాలేజీ పరిధిలో రీసెర్చ్ మెథడాలజీపై వారం పాటు ప్రత్యేక కోర్సు నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డి ఈ కోర్సును ప్రారంభించనున్నారు. పరిశోధనా విధానంపై పీహెచ్‌డీ స్కాలర్లకు అవగాహన కల్పిస్తారు. ఆర్ట్స్ కాలేజీ పరిధిలోని అన్ని విభాగాలకు చెందిన పీహెచ్‌డీ స్కాలర్లు తప్పనిసరిగా హాజరుకావాలని అధికారులు కోరారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


ప్రత్యూష భరతనాట్య ప్రదర్శన

తొట్టంబేడు, మార్చి 16: ముక్కంటి శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వెంకటగిరికి చెందిన ప్రత్యూష శివ శంభో, అన్నమయ్య కీర్తనలు, అమ్మవారి భక్తి పాటలకు చేసిన నృత్యప్రదర్శనలు భక్తులను మైమరిపించాయి. శ్రీకాళహస్తి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరిరోజు శ్రీకాళహస్తి పట్టణంలోని స్వర్ణముఖి నదీతీరాన ఏర్పాటు చేసిన ధూర్జటి కళాప్రాంగణంలో తూర్పుగోదావరి జిల్లాకు చెందిన జాహ్నవి బృందం నృత్యప్రదర్శన, శ్రీకాళహస్తి పట్టణం రాజేశ్వరి, ప్రవళ్లికల నృత్యప్రదర్శనలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. కళాకారులకు దేవస్థానం అధికారులు సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

గాజులమండ్యం ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ



రేణిగుంట, మార్చి 16: రేణిగుంట మండలం గాజులమండ్యం రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా సునీల్ శనివారం బాధ్యతలు స్వీకించారు. కేవీబీపురం ఎస్‌ఐగా పనిచేస్తున్న ఆయన సాధారణ బదిలీపై రేణిగుంట మండలం రూరల్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

నిర్భయంగా ఓటు వేయండి

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 16: భయపడకుండా నిర్భంయగా ఓటు హక్కును ప్రజలు ఉపయోగించుకోవాలని ఎస్‌ఐ వెంకటనరసింహ తెలిపారు. మండలంలోని ఆలత్తూరు. బీఎన్‌కండ్రిగ గ్రామాలలో శనివారం కేంద్ర బలగాలు, పోలీసులతో కవాతు నిర్వహించారు. ఎన్నికల నింబంధనలను ఉల్లఘించిన, ఓటర్లను భయభ్రాతులకు గురి చేసిన చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

విడిది షెడ్డు ప్రారంభం

శ్రీకాళహస్తి, మార్చి 16: శ్రీకాళహస్తీశ్వరాలయ రెండో గేటు సమీపంలో ఇటీవల నిర్మించిన విడిది షెడ్డును ఆలయ ధర్మకర్తల మండలి అంజూరు శ్రీనివాసులు శనివారం ప్రారంభించారు.

టీడీపీ వెంటే బీసీలు

శ్రీకాళహస్తి, మార్చి 16: టీడీపీ వెంటే బీసీలు ఎప్పుడూ ఉంటారని ఆపార్టీ తిరుపతి పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షుడు రుద్రకోటి సదాశివం అన్నారు. శ్రీకాళహస్తిలో కూటమి అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డిని కలిసి తిరుమల శ్రీవారి ప్రసాదాలను అందజేశారు. శ్రీవారి ఆశీస్సులతో వచ్చే ఎన్నికల్లో సుధీర్ రెడ్డి గెలుపొందాలని ఆకాంక్షించారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్షా సామగ్రి వితరణ


విద్యార్థులకు పరీక్షా సామగ్రి వితరణ చేస్తున్న దాతలు

నాగలాపురం, మార్చి 16: మండల పరిధిలోని ఎస్ఎస్ పురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు తిరుపతికి చెందిన ఎన్ఆర్ఐ యశ్వంత్ కుమార్ తండ్రి హరిక్రిష్ణ మనాయుడు శనివారం పరీక్షా సామగ్రిని వితరణగా అందించారు. మొత్తం 40 మంది విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన సామగ్రి వితరణగా ఇచ్చినట్లు ఇన్‌చార్జి హెచ్ఎం చెనంన కేశవులు తెలిపారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ రఘురామయ్య, యువ నాయకుడు ఉదయుమార్ దాతలను సన్మానించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ విష్ణు ప్రియ, వెల్ఫేర్ అసిస్టెంట్ గిరిబాబు, ఉపాధ్యాయులు భూపాల్, వెంకటేశ్వర్లు, కంచి శ్రీదేవి, బాబు, చంద్రిక, చిరంజీవి, కుమ్మర శ్రీదేవి, మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ఐపీఎస్ అధికారి



శ్రీకాళహస్తి, మార్చి 16: తమిళనాడుకు చెందిన ఐపీఎస్ అధికారి, ఇంటిలిజెన్స్ డైరెక్టర్ జనరల్ ప్రమోద్ కుమార్ శనివారం ముక్కంటి ఆలయాన్ని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అధికారులు వారికి స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. గురు దక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

పరీక్షా కేంద్రాల్లో వసతులు కల్పించాలి

శ్రీకాళహస్తి, మార్చి 16: పదవ తరగతి పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన పై అధికారులు దృష్టి సారించాలని టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు కోబాక లక్ష్మణ్ శనివారం ప్రకటనలో కోరారు. అలాగే ఫీజుల పేరుతో హాల్ టికెట్ ఇవ్వకుండా విద్యార్థులను ఎవరు వేధించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బ్యాంకుకు చేరిన స్వర్ణాభరణాలు


ఆభరణాల లెక్క చూస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి, మార్చి 16: ముక్కంటి ఆలయానికి చెందిన బంగారు ఆభరణాలను అధికారులు శనివారం బ్యాంకు లాకర్‌లో భద్రపరిచారు. మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఉత్సవర్లను అలంకరించేందుకు రెండు వారాల క్రితం బంగారు నగలను ఆలయానికి తీసుకువచ్చారు.. ఉత్సవాలు ముగియడంతో శనివారం తిరిగి లాకరులో భద్రపరిచారు.

అమరజీవి సేవలు చిరస్మరణీయం


పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి, మార్చి 16: అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయమని ముక్కంటి ఆలయ పాలక మండలి సభ్యుడు రాము గుప్తా అన్నారు. శ్రీకాళహస్తి పట్టణం బజారు వీధిలోని కన్యకా పరమేశ్వరి ఆలయం ఎదుట పొట్టి శ్రీరాములు జయంతి పురస్కరించుకుని పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కన్యకా పరమేశ్వరి ఆలయ పాలకమండలి అధ్యక్షుడు మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టండి


సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రయాదవ్

రేణిగుంట, మార్చి 15: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని ప్రజలకు భారత చైతన్య యోజన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు రామచంద్రయాదవ్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హల్‌లో జరిగిన భవిష్యత్ తరాల ధర్మపోరాట సభలో బీసీవై పార్టీతరపున శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా కుప్పన్న గారి దినాద్‌బాబు, తిరుపతి నియోజవర్గానికి కృష్ణవేణిని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుడూ గడిచిన ఐదేళ్లగా వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అవినీతి అక్రమాలు, కబ్జాలతో ప్రజలు విసిగెత్తిపోయారని రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆవుల రమేష్ యాదవ్, శ్రీకాళహస్తి, తిరుపతి, పుంగనూరుకుచెందిన పార్టీనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళ అనుమానాస్పద మృతి

వరదయ్యపాళెం, మార్చి 16: మండలంలో ఒంటరి మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటనకు సంబంధించి వరదయ్యపాళెం పోలీసుల కథనం మేరకు వివరాలిలా.. మండంలోని పాండూరు పంచాయతీ పాదిరికుప్పంకు చెందిన అన్నంబేటి వసంత(43) భర్త వదలివేయడంతో 14 సంవత్సరాలుగా ఒంటరిగా పిల్లలతో జీవిస్తోంది. ఓ పరిశ్రమలో పనిచేస్తూ తన ఇద్దరు పిల్లలను పోషించుకుంటోంది. కుమారుడు (16) పుత్తూరులో ఇంటర్ చదువుతున్నాడు. కుమార్తె(14) సత్యవేడు మండలంలోని హాస్టల్‌లో ఉంటూ 9వ తరగతి చదువుతోంది. ఈ క్రమంలో కుమారుడికి ఇంటర్ పరీక్షలు ముగియడంతో శ్రువారం ఇంటికి వచ్చి చూడగా తల్లి ఉరి వేసుకుని ఉండటంతో భయపడి తాతకు తెలియజేయడంతో పోలీసులు సమాచారం ఇచ్చారు. సీఐ దివాకర్‌రెడ్డి, ఎస్‌ఐ ప్రతాప్ అక్కడికి చేరుకున్నారు. మూడు రోజుల క్రితం ఉరివేసుకున్నట్టు పోలీసులు నిర్ధారించారు. ఘటనా స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించి మృతేదహాన్ని బంధువులకు అప్పగించారు. తన పిల్లల పోషణ భారంగా మారడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు గోడకు రాసి ఉండటం గుర్తించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

తిరుచ్చి వాహనంపై వైకుంఠవాసుడి వైభవం



తొట్టంబేడు, మార్చి 16: శ్రీకాళహస్తి మండలంలోని తొండమాన్‌పురంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్నవెంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో బాగంగా శనివారం ఉదయం ఆలయంలో శ్రీవారికి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి స్వామివారు తిరుచ్చి వాహనంపై పురవీథుల్లో వైకుంఠవాసుడు విహరించారు. ఆలయఅలంకార మండపంలో అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తిని అలంకరించి తిరుచ్చివాహనంలో పురవీథుల్లో ఊరేగించారు.

సభ్యత్వం కూడా తీసుకోని వారికి టికెట్ ఎలా ఇస్తారు?

పిచ్చాటూరు, మార్చి 16: పార్టీ కష్టకాలంలో ఉండగా ఐదేళ్ళ పాటు పార్టీకి అండగా ఉన్న వారిని కాదని ఇంకా కూడా టీడీపీ సభ్యత్వం తీసుకోని వైసీపీ ఎమ్మెల్యే ఆదిమూలానికి పార్టీ టికెట్ ఎలా ఇస్తారని ఆ పార్టీకి చెందిన కొందరు నాయకులు ప్రశ్నించారు. శనివారం పిచ్చాటూరులో టీడీపీ కి చెందిన కొందరు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై పెట్టిన అక్రమ కేసులు ఎలా మరచిపోగలమని స్వార్థం కోసం రంగుల మార్చిన వ్యక్తికి టికెట్ ఇవ్వడం ధర్మమా అని వారు ప్రశ్నించారు. సమావేశంలో రాజేంద్రరెడ్డి, పురుషోత్తం, జయచంద్రారెడ్డి, సురేష్‌నాయుడు, వెంకటేశులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దులో అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ


సురుటుపల్లె సరిహద్దు చెక్‌పోస్టు వద్ద రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ

నాగలాపురం, మార్చి 16: మండల పరిధిలోని సురుటుపల్లె గ్రామం వద్ద ఉన్న సరిహద్దు పోలీస్ చెక్‌పోస్టులను శనివారం తిరుపతి ఎస్పీ కృష్ణ కాంత్ పటేల్ ఆకస్మిక తనిఖీ చేపట్టారు. అక్కడి రికార్డులను, సీసీ కెమెరాలను పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపధ్యంలో సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎస్పీ వెంట తిరుపతి సెబ్ అడిషినల్ ఎస్పీ రాజేంద్ర ప్రసాద్, ఎస్పీ డీఎస్పీ భాస్కర్‌రెడ్డి, ఎస్పీ సీఐ శ్రీనివాసులు, పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసరావు, సత్యవేడు సీఐ దివాకర్ రెడ్డి, నాగలాపురం ఎస్ఐ ఓబయ్య పాల్గొన్నారు.

సత్యవేడు: సార్వత్రిక ఎన్నికల వేళ అక్రమ మద్యం, నగదు రవాణా తదితర వాటిపై రాష్ట్ర సరిహద్దుల్లోని చెక్‌పోస్టులపై నిరంతరం నిఘా ఉంచాలని ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ పోలీసు అధికారులను ఆదేశించారు. శనివారం సత్యవేడులోని బార్డర్ చెక్‌పోస్టును ఎస్పీ సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎప్పటికప్పుడు సమస్యాత్మక కేంద్రాలపై దృష్టి సారించి శాంతి భద్రతలు తలెత్తకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ దివాకర్‌రెడ్డి, ఎస్ఐలు వీరాంజనేయులు, ప్రతాప్, ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ ఇన్‌స్పైర్‌కి మూడు ప్రాజెక్టుల ఎంపిక



తిరుపతి(విద్య), మార్చి 16: జాతీయ స్థాయి ఇన్‌స్పైర్‌కి జిల్లా నుంచి మూడు ప్రాజెక్టులు ఎంపికైనట్లు జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్ పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా గంగవరం మండలంలోని మదర్‌థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ ప్రోగ్రామ్‌లో జాతీయ స్థాయికి 24 ప్రాజెక్టులు ఎంపిక కాగా ఇందులో జిల్లాకు చెందినవి మూడు ఉన్నట్లు తెలిపారు. దొరవారి సత్రం మండలం కల్లూరు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి వి.నిరూష రూపొందించిన ట్రోలీ ఫర్ సీవేజ్ క్లీనింగ్, రామచంద్రాపురం మండలం కమ్మపల్లె గవర్నమెంట్ హైస్కూల్ విద్యార్థి ఎం.వాణి రూపొందించిన కోకోనట్ డ్రిల్లర్ అండ్ బ్రేకర్, రేణిగుంట మండలం గుత్తివారిపల్లె జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి గొల్లపల్లి రేష్మ రూపొందించిన బాయిల్డ్ ఎగ్ సెల్ పీలర్ ప్రాజెక్టులు ఎంపికయ్యాయని వివరించారు. గైడ్ టీచర్లుగా వీవీ రమణయ్య(కల్లూరు జెడ్పీహెచ్ఎస్), ఎస్‌జే కామేశ్వరి(జీహెచ్ఎస్, కమ్మపల్లె), పి.మునిరెడ్డి(జెడ్పీహెచ్ఎస్, గుత్తివారిపల్లె) వ్యవహరించారని తెలిపారు. డీఈవో డాక్టర్ వి.శేఖర్ విద్యార్థులతో కలసి జేసీ ధ్యానచంద్రని మర్యాద పూర్వకంగా కలిశారు.

ఫ్యాన్ రెక్కలు ముక్కలవడం ఖాయం: ఆదిమూలం


టీడీపీ నాయకులతో ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం, మార్చి 16: నేటితో దౌర్జన్య, మోసపూరితమైన పరిపాలను తెర పడిందని, రానున్న ఎన్నికల్లో వైసీపీ ఫ్యాన్ రెక్కలు ముక్కలవడం ఖాయమని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. శనివారం నారాయణవనంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద కార్యకర్తలలో మాట్లాడతూ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడం, రాక్షస పాలన నుంచి ప్రజలకు విముక్తి కలిగిందన్నారు. విధ్వంసక, విద్వేష పాలనతో రాష్ట్రాన్ని అన్ని విధాలుగా నాశనం చేసిన సీఎం జగన్‌ను ఇంటికి పంపడానికి రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. పెద్దిరెడ్డిని నమ్మి పూర్తిగా మోసపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో అన్నివర్గాల వారికి రాజకీయాలకతీతంగా న్యాయం చేశానని గుర్తు చేశారు. నియోజకవర్గంలోని అన్ని వర్గాల నాయకులను, కార్యకర్తలను కలుపుకుని టీడీపీని అఖండ మెజారిటీతో గెలిపించుకుని, చంద్రబాబు నాయుడు, నారా లోకేశ్ నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు భాస్కరన్, గోవిందస్వామి, కందస్వామినాయుడు, రవి, మాణిక్యం రెడ్డి, దానా పరుశురామయ్య, విజయ్‌కుమార్, దొరవేలు, వేలురెడ్డి, బాలసుబ్రహ్మణ్యం, వాసుదేవయ్య, దాము రెడ్డి, నరేష్, సుబ్రహ్మణ్యం, జయచంద్ర నాయుడు, చంద్రశేఖర్, మోమన్‌రాజు, శరవణ, మునస్వామి, రఘుపతిరెడ్డి, నాగరాజు, యువరాజు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 118 కేసుల పరిష్కారం


కక్షిదారుల మధ్య రాజీచేస్తున్న న్యాయమూర్తులు

పుత్తూరు టౌన్, మార్చి 16: పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో 118 కేసులను పరిష్కరించినట్లు న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌సీ రామవేంద్ర తెలిపారు. 38 సివిల్, 68 క్రిమినల్, 12 ప్రీలిటిగేషన్ కేసులను పరిష్కరించి కక్షిదారుల మధ్య రాజీ చేశామని చెప్పారు. లోక్‌అదాలత్ ప్రిసైడింగ్ అధికారులుగా న్యాయమూర్తులు రామవేంద్ర, గోపాలకృష్ణ వ్యవహరించారు. భాస్కర్, దిలీప్ రెడ్డి, అమరనాథ్ బెంచ్ సభ్యులుగా వ్యవహరించారు.

పుత్తూరు వార్తలు

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం

వడమాలపేట, మార్చి 16: అప్పలాయగుంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం, ఊంజలసేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం వేకువ జామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వెంకటేశ్వరస్వామివారిని సర్వాభరణాలు, పూలమాలలతో ఊయలలో అలంకరించి వేదమంత్రాలు, భక్తులు గోవిందనామ స్మరణల నడుమ శ్రీవారి ఊంజలసేవ నిర్వహించారు. అనంతరం సర్వాలంకార భూషితుడైన పద్మావతీ అండాల్ సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారిని మేళతాలలు, మంగళ వాయిద్యాల నడుమ మాడ వీదుల్లో ఊరేగించారు. భక్తులు నారికేల, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయానికి చేరుకున్న స్వామివారికి మంగళ హారుతలిచ్చారు. కార్యక్రమంలో ఆలయ అధికారి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్న ఊంజలసేవ



నారాయణవనం, మార్చి 16: నారాయణవనంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న ఊంజలసేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి, నిత్యకైంకర్యాలు చేపట్టారు. అనంతరం స్వామివారిని, శ్రీదేవి, భూదేవి ఉత్సవర్లను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ బట్టాచార్య, శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వెంకన్న ఊంజల సేవ నిర్వహించారు. భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. ఆలయాధికారులు భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయాధికారులు నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

వడమాలపేటను అభివృద్ధి చేసి చూపిస్తా: భానుప్రకాష్


తిరుమణ్యంలో టీడీపీ జెండా ఆవిష్కరిస్తున్న భానుప్రకాష్ తదితరులు

వడమాలపేట, మార్చి 16: సైకిల్ గుర్తుకు ఓటేసి టీడీపీని గెలిపించండి.. వడమాలపేట మండలాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ అన్నారు. శనివారం బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా తిరుమణ్యంలో గ్రామంలో పర్యటించారు. రాష్ట్ర టీఎన్‌టీయూసీ కార్యదర్శి సుబ్రమణ్యం రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు స్వాగతం పలికారు. టీడీపీ జెండా ఆవిష్కరించారు. మేనిఫెస్టోను వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన గెలుపునకు ప్రతి ఓటరూ సహకరించాలని కోరారు. ఐదేళ్లుగా వడమాలపేట అభివృద్ధికి దూరంలో ఉందని, టీడీపీ అధికారంలోకి రాగానే అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు జానా వెంకట్య, ధనంజయులు, హేమావతి, లక్ష్మీప్రసన్న, మునిశేఖర్, శేషాద్రి, మునిరాజ, సుబ్బారెడ్డి, జ్యోతిరెడ్డి, శ్రీనివాసులు, విశ్వనాధన్, కృష్ణయ్య, వెంకటరమణ, హరి, తిరుమణ్యం, తెలుగు యువత నాయకులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 338 మంది విద్యార్థుల ఎంపిక


ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో అధ్యాపక బృందం

పుత్తూరు టౌన్, మార్చి 16: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన జాబ్ మేళాలో 338 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. శనివారం డిగ్రీ కళాశాలలో జేకేసీ, ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. 477 మంది పాల్గొనగా 338 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారికి సంబంధిత కంపెనీల ప్రతినిధులు ధ్రువీకరణ పత్రాలను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ వేణుగోపాల్, సురేష్‌కుమార్, అధ్యాపకులు సంధ్య, వీరయ్య, కోటేశ్వరయ్య, సుజనా, దీనదయాల్, సీఎన్ లత, ప్లేస్మెంట్ అధికారులు సురేష్‌బాబు, జేకేసీ మెంటార్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా సామగ్రి అందజేత



వడమాలపేట, మార్చి 16: వడమాలపేటలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు బహుజన సేవా సంఘం ఆధ్వర్యంలో పరీక్షా సామగ్రి అందజేశారు. సంఘం అధ్యక్షుడు దిలీప్, విద్యా కమిటీ చైర్మన్ ధనంజయులు, సంఘ నాయకులు వెంకటస్వామి, భానుప్రసాద్, వెంకటేష్, మునెయ్య, సాయి, వినయ్ పాల్గొన్నారు.

వడమాలపేట ఎస్‌ఐగా దర్మారెడ్డి



వడమాలపేట, మార్చి 16: వడమాలపేట ఎస్‌ఐగా ధర్మారెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ సుధాకర్ స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ కావడంతో గాజులమడ్యం నుంచి ధర్మారెడ్డి వడమాలపేటకు వచ్చారు.

అంబేడ్కర్ యువజన సంఘం ఉపాధ్యక్షులుగా గురువయ్య, ప్రభాకర్



వడమాల పేట, మార్చి 16: ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం ఉపాధ్యక్షులు ఓబీఆర్ కండ్రిగ గ్రామానికి చెందిన గురువయ్య, కల్లూరుకు చెందిన ప్రభాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశంలో సంఘ అధ్యక్షుడు జయంత్‌బాబు, నాయకులు దేవరాజులు, వెంకటేష్, నాగరాజు, మస్తాన్, వెంకటస్వామి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, మార్చి 16: పట్టణంలోని ఆరేటమ్మ కాలనీ వద్ద ఉన్న మల్లాలమ్మను నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ శనివారం దర్శించుకున్నారు. అమ్మవారి జాతరలో భాగంగా మేదర సంఘ ఆహ్వానం మేరకు భానుప్రకాష్ ఆలయంలో పూజలు నిర్వహించారు. నిర్వాహకులు అమ్మవారి తీర్థప్రసాదాలను అందించారు.

అంతర్రాష్ట్ర చెక్ పోస్టుల్లో తనిఖీలు



తిరుపతి క్రైం మార్చి 16: ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని జిల్లా పోలీస్ యంత్రాంగం ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ శనివారం తనిఖీ చేశారు. ప్రధానంగా నురుటుపల్లి, దాసుకుప్పం, మాదరపాకం, నాయుడు కుప్పం, ఆరూర్, తడ చెక్‌పోస్టులను పరిశీలించి, సిబ్బంది పనితీరును సమీక్షించారు. ఇసుక, గ్రావెల్ అక్రమంగా తరలిపోకుండా చూడాలని ఆదేశించారు. 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఫ్లెక్సీల తొలగింపు

పుత్తూరు అర్బన్, మార్చి 16: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో పట్టణ వ్యాప్తంగా ఉన్న రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను తొలగింపునకు అధికార యంత్రాంగం చేపట్టింది. కేఎన్ రోడ్డు కూడలిలో ఉన్న అధికార పార్టీ నాయకుల ఫ్లెక్సీలను శనివారం మధ్యాహ్నం నుంచి తొలగించారు. అలాగే పున్నమి సర్కిల్ వద్ద ఉన్న రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి సైతం ముసుగులను ఏర్పాటు చేస్తున్నారు. సచివాలయాల ముందు వైసీపీ నాయకులు ఏర్పాటు చేసిన పార్టీ జెండాల తొలగింపు నత్తనడకన సాగుతోంది. ఆదివారం సాయంత్రానికి పూర్తి స్థాయిలో రాజకీయ పార్టీల జెండాల తొలగింపు, శిలాఫలకాలపైన, ప్రభుత్వ వాహనాలపైన సీఎం, మంత్రుల ఫొటోలు కనబడకుండా చర్యలు తీసుకుంటున్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు



మోహన్‌రెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న సుధీర్ రెడ్డి

టీడీపీలో చేరిన వైసీపీ నేత

ఏర్పేడు, మార్చి 16: మండలంలోని అంజిమేడుకు చెందిన వైసీపీ నేత కన్నలి మోహన్‌రెడ్డి శనివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరుడైన మోహన్‌రెడ్డి వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. 2014, 2019 ఎన్నికల్లో మధుసూదన్‌రెడ్డి కోసం పని చేశారు. ఇటీవల ఎమ్మెల్యే తీరుతో మనస్తాపానికి గురైన మోహన్‌రెడ్డి టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. కొంత మంది వైసీపీ నేతలు ఆయన్ను కలిసి పార్టీ మారొద్దని కోరారు. ఈ నేపథ్యంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి సమక్షంలో శనివారం మోహన్‌రెడ్డి టీడీపీలో చేరారు.

టీడీపీలోకి వలసలు

తొట్టంబేడు: మండలంలోని తాటిపర్తి వైసీపీ ఎంపీటీసీ భర్త శోభన్‌బాబునాయుడు టీడీపీలో చేరారు. తాటిపర్తి, కల్లిపూడి గ్రామాలకు చెందిన పలువురు ఆయన వెంట టీడీపీలో చేరారు. వీరిలో సురేంద్ర, బాలాజీ, రామూర్తి, రమేష్‌నాయుడు, మనోహర్‌నాయుడు, మునిరత్నంనాయుడు, పునీత్ నిరంజన్, హరినాయుడు, చంచయ్య, దాము, రాకేష్ ఉన్నారు.

ప్రోటోకాల్ దర్శనాలపై అభ్యంతరం

శ్రీకాళహస్తి, మార్చి 16: ఎన్నికల నియమావళి అమలైనప్పటికీ రాజకీయ ప్రోటోకాల్ దర్శనాలు కొనసాగించడంపై అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. ఆదివారం అధికార పార్టీ ఎమ్మెల్యే దర్శనానికి వస్తున్నట్లుగా... వారికి ప్రోటోకాల్ దర్శనాలు చేయవలసిందిగా ఆలయంలోని ఓకీలక అధికారి సిబ్బందికి మెసేజ్ పంపించారు. ఇది గ్రూపులో చూసిన ఆలయ ఉద్యోగులు ఎన్నికల నియమావళిలో కూడా ప్రోటోకాల్ దర్శనాలు కొనసాగించవచ్చా అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అలాగే పలువురు ప్రోటోకాల్ దర్శనాలపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు.

చిలకలూరి పేట సభకు తరలిరండి

శ్రీకాళహస్తి, మార్చి 16: కూటమి ఆధ్వర్యంలో చిలకలూరిపేటలో జరిగే ఉమ్మడి బహిరంగ సభకు పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అన్ని వర్గాల ప్రజలు జయప్రదం చేయాలని కోరారు.

గిరిజనకాలనలో ఊపందుకున్న అక్రమ నిర్మాణాలు



శోత్రీయభూముల్లో అక్రమ నిర్మాణాలు

వరదయ్యపాళెం, మార్చి 16: మండలంలోని వీకేఆర్‌పై గిరిజన కాలనీలో ఉన్న శోత్రీయభూముల్లో అక్రమ నిర్మాణాలు జోరందుకున్నాయి. శనివారం చిన్నపాండూరు పంచాయతీ వీకేఆర్‌పై కాలనీలో కొందరు రోడ్డు పక్కనే గల శోత్రీయభూముల్లోని ఖాళీ స్థలాన్ని ఆక్రమించి ఆఘమేఘాలపై అక్రమ నిర్మాణాలు చేపట్టారు. స్థానికులు అడ్డుకుంటే వారిపై దాడులకు తెగబడటంతో మౌనం వహించాల్సి వస్తోంది. ఎన్నికల హడావుడిలో అధికారులు ఉండటంతో ఇదే అదనుగా అక్రమార్కులు ఖాళీ స్థలం కనిపిస్తే ఆక్రమించుకుని వెంటనే నిర్మాణాలు చేయడం షరామాములుగా మారింది. కాలనీలో అపోలో టైర్ల పరిశ్రమ, పక్కనే హీరో మోటార్సు వంటి భారీ పరిశ్రమల కారణంగా ఈ ప్రాంతంలో భూములకు గిరాకీ ఏర్పడింది. దీంతో అక్రమార్కుల కళ్లు ఆ భూములపై పడ్డాయి. ఇప్పటికే దాదాపు 75 శాతం రోడ్డుకు ఇరువైపులా ఆక్రమించి హోటళ్లు, ఇతర దుకాణాలు ఏర్పాటు చేశారు. మరో వైపు ఖాళీ ప్రదేశాలతో భవన నిర్మాణాలు చేపడుతున్నారు. కాలనీ చుట్టూ శోత్రీయ భూములుండటంతో ఇక్కడ ఈ భూముల్లో అక్రమ నిర్మాణాలు పెరిగిపోవడంతో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. శనివారం అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు రావడంతో తహసీల్దారు ఉదయభారతి రెవెన్యూ సిబ్బందిని పంపించడంతో వారు అక్కడికి చేరుకుని అక్రమ నిర్మాణాలను అడ్డుకుని, వాటిని తొలగించారు.

ఎన్నికల నియమావళి అతిక్రమిస్తే చర్యలు తప్పవు

● ఆర్వో నరసింహులు

సత్యవేడు, మార్చి 16: ఎలెక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే చర్యలు తప్పవని సత్యవేడు నియోజకవర్గ ఎన్నికల అధికారి నరసింహులు పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలుకు సంబంధించి రెవెన్యూ కార్యాలయంలో అసిస్టెంట్ రెవెన్యూ అధికారి, తహసీల్దార్ రామాంజనేయులు ఆధ్వర్యంలో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి మాట్లాడుతూ శనివారం నుంచి ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉంటుందన్నారు. ఎన్నికల కోడ్ సక్రమంగా అమలు చేయడానికి రాజకీయ పార్టీ నేతలు సహకరించాలన్నారు. సమావేశంలో ఎస్‌ఐ వీరాంజనేయులు, బీజేపీ మండల అధ్యక్షుడు మునిప్రతాప్, వైసీపీ నాయకుడు శ్యాంప్రసాద్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు శేషాద్రి, ఐటీడీపీ నాయకుడు దిలీప్, సీనియర్ అసిస్టెంట్ సురేష్ పాల్గొన్నారు.

మురళీకృష్ణకు అభినందన



మురళిని అభినందిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

శ్రీకాళహస్తి, మార్చి 16: ఆంధ్రప్రదేశ్ రజక కులవృత్తుల సమైక్య రాష్ట్ర కార్యదర్శిగా నియామకం పొందిన మురళీకృష్ణను పలువురు అభినందించారు. పట్టణానికి చెందిన మురళీకృష్ణ శనివారం రజక కులవృత్తుల సమైక్యకు రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికయ్యారు. దీనిపై బీసీ సంక్షేమ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు బీసీలంతా ఐక్యమత్యంగా హక్కులను సాధించుకోవాలని అభిప్రాయపడ్డారు. ఉమేష్ రావు, బుజ్జి, భాస్కర్, కోట చంద్రశేఖర్, మణి తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 61 కేసులు పరిష్కారం



కోర్టులో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం

సత్యవేడు, మార్చి 16: సత్యవేడు జూనియర్ సివిల్ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 61 కేసులు పరిష్కారం అయినట్లు ఇన్‌చార్జి జడ్జి వీ.గోపాలకృష్ణ తెలిపారు. కోర్టు పరిధిలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వివిధ కేసులకు లోక్ అదాలత్‌లో పరిష్కారం లభించింది. ఇందులో భాగంగా క్రిమినల్ కేసులు 40, సివిల్ 13, పీఎల్‌పీ (బ్యాంకు) కేసులు 8, ఐకేసులను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ చక్కటి వేదిక అన్నారు. లోక్ అదాలత్‌లో డబ్బు, సమయం వృధా కాకుండా ఇరు వైపులా కక్షిదారులు విజయం సాధిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఏపీపీ ప్రశాంతి, బార్ అసోసియేషన్ సభ్యులు, పోలీస్, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

సత్యవేడు, మార్చి 16: రేపటి నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో మండలంలోని రాజగోపాలపురం జడ్పీ హైస్కూల్‌కు చెందిన టెన్త్ విద్యార్థులకు జనసేన మండల అధ్యక్షుడు రూపేష్‌కుమార్ పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. పాఠశాలలో చదువుతున్న 48 మంది విద్యార్థిని, విద్యార్థులకు పరీక్షల సామగ్రి అందించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, పాల్గొన్నారు.

యూకలిప్టస్ చోరీపై విచారణ వేగవంతం

● ఏపీ ఎఫ్‌డీసీ డీఎం బ్రహ్మయ్య



సత్యవేడు, మార్చి 16: సత్యవేడు అటవీ అభివృద్ధి సంస్థ డివిజన్ పరిధిలోని ఆరుదురు ప్లాంటేషన్‌లో ఇటీవల అక్రమంగా తరలించడానికి సిద్ధంగా ఉంచిన యూకలిప్టస్ లోడ్ ట్రాక్టర్ పట్టివేతపై విచారణ వేగవంతం చేశామని ఏపీ ఏఫ్‌డీసీ డివిజనల్ మేనేజర్ బ్రహ్మయ్య పేర్కొన్నారు. ఈ నెల 14న ఆంధ్రజ్యోతిలో యూకలిప్టస్ తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత వివరాలు వెల్లడించని ఏపీ ఎఫ్‌డీసీ పేరిట కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో స్పందించిన డీఎం శనివారం వివరాలను మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుదురు ప్లాంటేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తులు కొందరు యూకలిప్టస్ కలప నరికి తరలిస్తున్నట్టు సమాచారం అందగానే వెంటనే స్పందించామన్నారు. చెట్లను నరికిన వ్యక్తులు పరారు కావడంతో వారిని పట్టుకునేందుకు ప్రయత్నిన్నామన్నారు. దీనికి సంబంధించి విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన డీపీఎంకు మెమో జారీ చేసినట్టు ఆయన తెలిపారు. అయితే ఈ దొంగతనం వెనకాల శాఖకు సంబంధించిన ఉద్యోగుల హస్తముందున్న ఆరోపణలను ఆయన ఖండించారు. సామాజిక మాధ్యమాల్లో తమశాఖపై నిరాధారమైన ఆరోపణ చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

లోక్ అదాలత్ తీర్పు అంతిమం



మాట్లాడుతున్న అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్

శ్రీకాళహస్తి, మార్చి 16: లోక్ అధాలత్ తీర్పు అంతిమంగా పరిగణిస్తారని 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ అన్నారు. పట్టణంలోని న్యాయస్థాన భవనంలో శనివారం అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు జాతీయ లోక్ అధాలత్ కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు జరిగిన అవగాహన సమావేశంలో న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ...లోక్ అదాలత్ ఉద్దేశాన్ని వివరించారు. పెండింగ్ కేసులను సులభంగా సత్వరం పరిష్కారం పొందవచ్చని వివరించారు. అలాగే ఇరువర్గాలు విజేతలుగా పరిగణించ బడతారని చెప్పారు. రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సమయం, ధనం ఆదా అవుతుందని తెలిపారు. అనంతరం లోక్ అదాలత్ ప్రారంభించి పలు కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి సీనియర్ సివిల్ జడ్జి బేబీ రాణి, ఇంచార్జి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సత్య కాంత్ కుమార్, పలు ప్రభుత్వ శాఖల అధికారులు, కోర్టు సిబ్బంది, ఫిర్యాదుదారులు, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతి పూజ



సరస్వతి పూజలో విద్యార్థులు

శ్రీకాళహస్తి, మార్చి 16: పట్టణంలోని జడ్పీ బాలురు ఉన్నత పాఠశాలలో శనివారం సరస్వతీ పూజ నిర్వహించారు. సోమవారం నుంచి జరగబోయే పదవ తరగతి పరీక్షల్లో మంచిగా రాణించాలని అందరూ ప్రార్థించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరి, తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా శాంతి అభిషేకం





అలంకార మండపంలో ఉత్సవర్లకు అభిషేకాలు - అలంకరించి హారతులిస్తున్న అర్చకుడు

శ్రీకాళహస్తి, మార్చి 16: శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో ఉత్సవమూర్తుల శాంతి అభిషేకం శాస్త్రోక్తంగా జరిగింది. మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిసిన తరవాత రోజు ఉత్సవమూర్తులకు శాంతి అభిషేకం నిర్వహించడం సంప్రదాయం. ఇందులో భాగంగా శనివారం ముక్కంటి ఆలయంలోని అలంకార మండపం వద్ద విశేష పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ అనువంశిక ప్రధానార్చకుడు స్వామినాథన్ గురుకుల్ కలశ స్థాపనతో సంకల్ప పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులకు విశేషాభిషేకాలను నిర్వహించారు. ఉత్సవాల్లో తెలియక పొరపాట్లు జరిగి ఉంటే ప్రాయశ్చిత్తం కోసం శాంతి హోమం చేశారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో అసమ్మతి ప్రచారాలకు తెర

● ఎస్సీవీ, మునిరామయ్యలతో సుధీర్‌రెడ్డి భేటీ



ఎస్సీవీ నాయుడితో సుధీర్ రెడ్డి తదితరులు

శ్రీకాళహస్తి, మార్చి 16: శ్రీకాళహస్తి టీడీపీలో విభేదాలున్నాయంటూ జరిగిన ప్రచారం పూర్తి అవాస్తవమని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుదీర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు ప్రకటించారు. రెండు రోజుల క్రితం టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థిగా బొజ్జల సుధీర్ రెడ్డి పేరును ప్రకటించిన విషయం తెలిసిందే. టికెట్ ఆశించిన ఎస్సీవీ నాయుడి వర్గం అసంతృప్తి ఎటువైపు దారితీస్తుందో అన్న ప్రచారం జోరుగా సాగింది.అయితే శనివారం ఎస్సీవీ ఇంటికి సుధీర్ రెడ్డి వచ్చారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, వెంకటగిరి, సత్యవేడు, తిరుపతి రూరల్ ప్రాంతాల్లో ఎస్సీవీ నాయుడికి మంచి పట్టుందన్నారు.సత్యవేడులో వైసీపీ నుంచి వచ్చిన వారికి తనను సంప్రదించకుండానే టికెట్ ప్రకటించడంపై ఎస్సీవీ నాయుడు కలత చెందిన విషయం వాస్తవమేనన్నారు.తనను ఆశీర్వదించి గెలిపిస్తే ఆయన అడుగుజాడల్లో పని చేస్తానని ప్రకటించారు. అలాగే ఆయనకు ఎమ్మెల్సీ లేదా రాజ్యసభ సభ్యత్వం వంటి గౌరవప్రద స్థానం కల్పించేందుకు పార్టీ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేస్తానని చెప్పారు.ఇక శ్రీకాళహస్తిలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులను కూడా కలిసి ఒక్కటిగా ముందుకు సాగుతామన్నారు.మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు మాట్లాడుతూ భవిష్యత్ కార్యాచరణ సమావేశం కేవలం తనతో పాటు తన వర్గం నాయకులకు టీడీపీ అధిష్ఠానం నుంచి భరోసా పొందడంపై చర్చించేందుకే అన్నారు. గత ఎన్నికల్లో బియ్యపు మధుసూదన రెడ్డిని గెలిపిస్తే తీవ్ర ద్రోహం చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ఓటమి కోసమే తాను అహర్నిశలూ శ్రమిస్తానని ప్రకటించారు. అనంతరం సుధీర్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే సత్రవాడ ముని రామయ్య ఇంటికి వెళ్లి తనను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.ఆయన కూడా సానుకూలంగా స్పందించి ఎన్నికల్లో అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. మొత్తంగా శనివారం జరిగిన పరిణామాలతో టీడీపీలో అసమ్మతి ప్రచారాలకు తెరపడింది.సుధీర్‌రెడ్డి వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గురవారెడ్డి, నాయకులు మునిరాజ నాయుడు, విజయ్‌కుమార్, కంఠా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాపం...కళాకారులు!

● శివరాత్రి ఉత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ తీరుపై తీవ్ర ఆరోపణలు

శ్రీకాళహస్తి, మార్చి 15: ముక్కంటి శివరాత్రి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో అవినీతి జరిగినట్లు ఆరోపణలు గుప్పుమన్నాయి.ఆలయ అధికారులు నిర్వహించాల్సిన సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ బాధ్యతను కొద్ది సంవత్సరాలుగా పట్టణానికి చెందిన ఒక వ్యక్తికి అప్పగించారు.నిజానికి శివరాత్రి ఉత్సవాల్లో ప్రదర్శనలు ఇచ్చేందుకు దేశం నలుమూలల నుంచి కళాకారులు దరఖాస్తులు చేసుకుంటారు. వాటిని పారదర్శకంగా పరిశీలించి తేదీలు, సమయం కేటాయించాలి.అయితే నిర్వహణ బాధ్యతలు తీసుకున్న వ్యక్తి ఇష్టమైన వారికి ఉత్సవాల్లోని అత్యంత కీలకమైన రోజుల్లో, పీక్ వేళల్లో స్లాట్ కేటాయిస్తున్నట్లు ఆరోపణలు పలుమార్లు వెల్లువెత్తాయి.గతంలో సాంస్కృతిక కార్యక్రమాలకు పెద్దఎత్తున ప్రముఖులు విచ్చేసేవారు.ఈ సంవత్సరం ఆలయ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఏ అతిథీ ప్రారంభోత్సవానికి హాజరు కాలేదు. కళాకారుల నుంచీ అసలు ఎన్ని దరఖాస్తులు వచ్చాయో...వాటిలో ఎన్నింటికి అవకాశం ఇచ్చారో వెల్లడించలేదు. తిరుపతికి చెందిన ఇద్దరు శాస్త్రీయ నృత్యకారుల దరఖాస్తులను కనీస సమాచారం లేకుండా తిరస్కరించారు. ప్రతి సంవత్సరం వచ్చి ప్రదర్శన చేసే ఆ రెండు బృందాల కార్యక్రమాలు షెడ్యూల్లో లేకపోవడంతో వారు శ్రీకాళహస్తికి చేరుకుని ఎలాగోలా అవకాశం ఇవ్వాలని ప్రాధేయపడ్డారు. చివరకు ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మిద్దెల హరి సిఫారసుతో చివరి రోజు కాసేపు నృత్య ప్రదర్శనకు అవకాశం ఇచ్చారు. ప్రదర్శన తర్వాత పారితోషికం అడిగితే మీకు స్లాట్ కేటాయించిందే ఎక్కువ పోండి...పోండి అంటూ తన నైజం చాటుకున్నారు.ఇలాంటి బాధితులు చాలామంది బయటకు చెప్పుకోలేక లోలోపల క్షోభ పడ్డారని చెబుతున్నారు.ఈ వ్యక్తికే ఉత్సవాల్లో నృత్యాలు చేసే కోలాట కళాకారుల నిర్వహణ బాధ్యతను కూడా అప్పగించారు.రథోత్సవం రోజున కనీసం తాగునీరు కూడా ఇవ్వలేదని కోలాట కళాకారులు ఆవేదన వ్యక్తం చేశారు.అసలు దశాబ్దకాలంగా ధూర్జటి కళా ప్రాంగణాన్ని ఆ ఒక్క వ్యక్తే ఎలా శాసించ గలుగుతున్నారని కళాకారులు ప్రశ్నిస్తున్నారు.ఇకనైనా దేవాదాయశాఖ అధికారులు సాంస్కృతిక కార్యక్రమాల్లో అవినీతిపై దర్యాప్తు చేసి కళాకారులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

స్థలాలిస్తామంటూ... ఎన్నికల ముందు వైసీపీ ఎర

● ఎమ్మెల్యే కుమార్తెను నిలదీసిన లబ్ధిదారులు



ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, పవిత్రారెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు





ఖాళీ స్థలం వద్ద ఏర్పాటు చేసిన మ్యాప్, ఇంటి నెంబరు

రేణిగుంట/తొట్టంబేడు, మార్చి 16: ఇళ్ల స్థలాల పేరుతో వైసీపీ ఎర అని శీర్షికన ఈ నెల 14న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్త నిజమైంది. వివరాల్లోకి వెళ్లితే... ఏర్పేడు మండలం పాగాలి ప్రాంతంలో రేణిగుంటకు చెందిన లబ్ధిదారులకు జగనన్న పట్టాలను అందజేసి ఇళ్ల స్థలాలుచూపించలేదు. అయితే ఎన్నికలు సమీపిస్తుండటంతో ఎలాగైనా ఇంటి పట్టాల లబ్ధిదారులతో ఓట్లు వేయించుకోవాలనే వైసీపీ నాయకుల పథకం బెడిసికొట్టింది. . ఏర్పేడు మండలం పాగాలి రెవెన్యూలో జగనన్న ఇంటి స్థలాల కోసం 157ఎకారాల్లో శ్రీకాళహస్తి, ఏర్పేడు, రేణిగుంట మండలాల్లో ఇల్లులేని పేదలకు కేటాయించారు. హౌసింగ్ స్కీమ్ కింద 4953మంది లబ్ధిదారులకు అనుమతి లభించింది. అయితే రేణిగుంట మండలంలోని లబ్ధిదారులకు మాత్రం ఇప్పటి వరకు స్థలాలు చూపలేదు. ఏర్పేడు మండలంలోని మేర్లపాక, దళితవాడ, కుమ్మరిగుంట ఎస్టీ కాలని, మేర్లపాక గ్రామంలోని రైతులకు 2004లో పట్టాలిచ్చారు. ఆ పొలాలను జగనన్న లేఅవుట్ కోసం అధికారులు తీసుకున్నారు. రైతులకు పరిహారం గిట్టుబాటుకాకపోవడంతో 11మంది రైతులు భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని కోర్టును ఆశ్రయించారు. ఆభూములకు సంబందించి కోర్టులో వివాదం నడుస్తోంది. కాగా ఎలక్షన్ కోడ్ దగ్గరపడడంతో ఆగమేగాలమీద రేణిగుంట ప్రజలకు స్థలాలను చూపుతామంటూ వైసీపీ ఎమ్మెల్యే ఎరవేశారు. కోర్టువివాదాల్లో ఉన్న ఆ భూముల్లోనే ప్లాట్ అలాట్‌మెంట్ చేస్తామని శనివారం ఉదయం పట్టణానికి చెందిన లబ్ధిదారులను రేణిగుంట నాయకులు వాహనాల్లో పాగాలికి తరలించారు. అయితే మండలాల వారీగా లబ్ధిదారులకు తెలియడంతో వేలాదిమంది ఒకసారిగా అక్కడకు చేరుకున్నారు. అయితే నాయకులు కొన్ని ప్లాట్లకుమాత్రం సరిహద్దు రాళ్ల వేసి మిగిలినవి ఖాళీగా వదిలేశారు. ఖాళీ జాగాల వద్ద ఇంటిజాగా మ్యాప్, ప్లాట్ నెంబరు సంఖ్య తెలిపే బోర్డులు తగిలించి వెనుకఖాళీ జాగా మొత్తం మీదే అని చెప్పడంతో లబ్ధిదారుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. రేణిగుంట ఎంపీపీ హరిప్రసాద్ రెడ్డి, వైసీపీ మండల ఇన్‌ఛార్జి పవిత్రారెడ్డి లబ్ధిదారులకు ఎంత చెప్పినా ప్రయోజనం లేకుండా పోయింది. ఆఖరికి రెండు రోజుల్లో ప్లాట్లకు రాళ్ల వేస్తామని చెప్పగా, ఎన్నికల కోడ్ వచ్చిన తరువాత ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఇళ్ల వద్ద ఉండే మమ్మల్ని పిలిపించి మోసం చేస్తారా అని శాపనార్థాలు పెట్టారు. వైసీపీ నేతలు ఏదో చేయాలనుకుంటే ఏదో జరిగి, వారి ప్రయత్నం చివరికి బెడిసి కొట్టింది. కాగా రేణిగుంట తహసీల్దారు ఈ కార్యక్రమానికి హాజరు కాకపోవడం గమనార్హం.